## డీఎస్సీపై వైకాపాకు నైతిక హక్కు లేదు

(మొదటి పేజీ తరువాయి)

వైకాపా ప్రయత్నించిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు ఏకంగా 300 కోర్టు కేసులు వేసిన దుర్మార్గపు వైఖరి వైకాపాదేనని మండిపడ్డారు. కోర్టుల చేత చీవాట్లు తిన్నా వైకాపా నేతలకు బుద్ధి రాలేదని, అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసి, తాము ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొస్తే కోర్టు కేసులతో అడ్డుకునేందుకు ప్రయత్నించడం నిరుద్యోగ యువత పట్ల వైకాపాకు ఉన్న చిత్తశుద్ధిని బయటపెడుతోందన్నారు. బొత్స సత్యనారాయణ .. డీఎస్సీపై చర్చకు మేము వెనక్కితగ్గేది లేదు. శాసనమండలిలో ఏ సమయానికైనా, ఎన్ని రోజులైనా చర్చించేందుకు సిద్ధం. మీరు, మీ పార్టీ సభ్యులు లేవనెత్తే ప్రతి అంశానికి ఆధారాలతో సహా సమాధానం చెబుతాం. అంతేకాదు, మీ ఐదేళ్ల పాలనలో డీఎస్సీ విషయంలో ఏం చేశారు? నిరుద్యోగులకు ఇచ్చిన హామీలేమిటి? వాటిని ఎలా విస్మరించారు? అనే సమగ్ర వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను కూడా పంపిస్తాం. ముందు దాన్ని చదువుకుని సభకు రండి. ఆ తర్వాత ఎవరు నిరుద్యోగులను మోసం చేశారో, ఎవరు వారికి ఉద్యోగాలు కల్పించారో మండలి వేదికగానే తేల్చుకుందాం అని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. ఐదేళ్ల పాటు రాత్రింబవళ్లు కష్టపడి చదివి, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను కించపరిచేలా వైకాపా నాయకులు మాట్లాడటం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగాలు సాధించిన యువతను, వారి భవిష్యత్తును వివాదాల్లోకి లాగొద్దని హెచ్చరించారు. మీ ఐదేళ్ల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి అసత్య ప్రచారాలతో యువతను మరోసారి మోసం చేయాలని చూడొద్దు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోండి. డీఎస్సీ విషయంలో ఎవరి చిత్తశుద్ధి ఏమిటో, ఎవరి పాలనలో యువతకు ద్రోహం జరిగిందో ఆధారాలతో సహా సభలోనే తేల్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దమ్ముంటే చర్చకు రండి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## నాగబాబుకు క్యాబినెట్ హోదా

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాల అమలును వేగవంతం చేయడం, వాటి పురోగతిని పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు నిర్వహించనున్నారు.

ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పచ్చదనం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు జిల్లాస్థాయి వ్యవస్థలను అనుసంధానిస్తూ సమర్థవంతమైన అమలు వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ నియామకం కీలకంగా నిలవనుంది.

రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవులు, చెట్ల విస్తీర్ణాన్ని పెంచడం, పునర్వనీకరణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టడం వంటి అంశాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదనడానికి ఏపీ గ్రీన్ ఏర్పాటు, దాని ఎగ్జిక్యూటివ్ కమిటీకి చైర్‌పర్సన్ నియామకం నిదర్శనంగా నిలుస్తుంది.

నాగబాబు నాయకత్వంలో ఏపీ గ్రీన్ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతాయని, "పచ్చని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని కూటమి భాగస్వామ్య పార్టీల నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది.

## డెల్టా పనులకు 'ఇరిగేషన్ క్యాలెండర్'

(మొదటి పేజీ తరువాయి)

10 ఇన్లెట్ల పునర్నిర్మిస్తున్నామని అన్నారు. యనమదురు డ్రైన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తున్నందున, ఉప్పుటేరును కూడా అభివృద్ధి చేయనున్నామన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో 2686 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరందించేందుకు, కేసనపల్లి కెనాల్ ప్రాజెక్ట్ కు అంచనాలు తయారు చేస్తున్నట్లు రామానాయుడు చెప్పారు. కొబ్బరి పంట ఆధారిత గ్రామాల్లోకి సముద్రపునీరు చొచ్చుకు వస్తోందన్నారు. ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాలకు మంచినీరందించాలనే ఉద్దేశ్యంతో 50 కోట్లతో కేసనపల్లి కెనాల్ ప్రాజెక్టును ప్రతిపాదించి నట్లు వివరించారు. 2017–18 గత టిడిపి పాలనలో జరిగిన డ్రెడ్జింగ్ పనులు మినహా, గత 5ఏళ్ళ వైసిపి పాలనలో ఒక్క రూపాయి పని కూడా జరుగలేదని విమర్శించారు. డ్రైన్ ద్వారా సముద్రపు నీరు రావడంతో వేలాది ఎకరాల్లో రైతులు కొబ్బరి పంట నష్టపోయారని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, శంకరగుప్తం డ్రైన్ సమస్యను రైతులు, నాయకులు నా దృష్టికి తీసుకువచ్చారన్నారు.

ఇరిగేషన్ నిపుణులతో ప్రత్యక్షంగా పరిశీలించి, మరో రెండు సార్లు సమీక్షలు జరిపి 21 కోట్ల నిధులు విడుదల చేశా మన్నారు.

# డీఎస్సీలో డీవియేషన్ లేదు



(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019–24 మధ్య 10–12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.

**డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే :** "గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటినీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఎఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, ప్రతిభను కించ పరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారు"అని ముఖ్యమంత్రి అన్నారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలు :** "మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నాను. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారనే వాళ్లు రావటం లేదు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నాను. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబు దారీతనంతో నియామకాలు జరిగాయి. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తాం. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి డిమాండ్ చేయాలి. రెండున్నర ఏళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం నా జీవితంలో ఇదే తొలిసారి. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. అనే నేనుగా నాకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉంది. వారికి ఏముందో ప్రజలే చెప్పాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి
- మెడికల్ రిప్రజెంటేటివ్స్ ధర్నాలో వక్తల డిమాండ్



**గుంటూరు:** దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పరిరక్షించాలని, కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ రిప్రజెంటేటివ్స్ సోమవారం స్థానిక ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. కామ్రేడ్ చి. కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాలపాటు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దురదృష్టకరమన్నారు. కొత్త లేబర్ కోడ్‌లలో సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల ప్రస్తావన లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. వెంకటరావు మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు గతంలో అమల్లో ఉన్న చట్టపరమైన హక్కులను కొత్త లేబర్ కోడ్‌లలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల హక్కులను చట్ట ప్రకారం పరిరక్షించాలని, వారి వృత్తికి అనుగుణంగా ప్రత్యేక పని విధానాలను కల్పించాలని కోరారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ విధానాన్ని వర్తింపజేయకూడదన్నారు.

అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రవేశంపై ఉన్న ఆంక్షలను తొలగించాలని కోరారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ వృత్తిపరమైన విధులను నిర్వహించేందుకు అవసరమైన పరిస్థితులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ధర్నాకు ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కే. ఉమామహేశ్వరరావు, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకుడు ఎం.వీ. ఆంజనేయులు, ఐఎఫ్‌టియు నాయకుడు అజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మెడికల్ రిప్రజెంటేటివ్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు.

## భవన కార్మికులకు 'మిత్ర' భరోసా

(మొదటి పేజీ తరువాయి)

2018–19 నాటికి రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని మంత్రి తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో 1214 మెమో ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో నమోదు ప్రక్రియ ఒక్కసారిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత రెండు నెలల్లోనే 6,777 మంది కార్మికులు కొత్తగా నమోదు చేసుకున్నారని వెల్లడించారు.

భవన నిర్మాణ కార్మికులు అంటే కేవలం నిర్మాణ రంగంలో పనిచేసేవారే కాదని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణ పనుల్లో 90 రోజులకు పైగా పనిచేసే కార్మికులు కూడా నమోదు చేసుకునేందుకు అర్హులని, అలాగే మైనింగ్ రంగంలో పనిచేసే కార్మికులు కూడా భవన నిర్మాణ కార్మికుల పరిధిలోకి వస్తారని వివరించారు. అర్హులైన కార్మికులు సులభంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం 'మిత్ర' యాప్ ద్వారా కూడా అవకాశం కల్పించిందని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల నుంచి వసూలు చేసే సెస్ (జవం) మొత్తంలో 10 శాతం నిధులను స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెస్‌లో 10 శాతం నిధులను స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఖర్చు చేయకపోగా, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించిందని అసెంబ్లీ వేదికగా మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. కార్మికుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం తిరిగి సంక్షేమ పథకాలను పట్టాలెక్కించి, అర్హులైన ప్రతి కార్మికుడికి ప్రయోజనం అందేలా చర్యలు చేపడుతోందని మంత్రి స్పష్టం చేశారు.

## గిరిజనుల భూములకు పూర్తి రక్షణ



(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పడం చిన్నపిల్లలకు చాక్లెట్ ఇవ్వకపోతే మారాం చేసినట్టుగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని మంత్రి ఆరోపించారు. ఐటీడీఏలను నిర్వీర్యం చేయడంతో పాటు గిరిజనుల కోసం అమలవుతున్న 18 పథకాలను నిలిపివేశారని విమర్శించారు.

"గురివింద గింజ తన కింద నలుపు ఎరుగదు అన్నట్టు వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు" అని మంత్రి అన్నారు. గిరిజనుల సంక్షేమం గురించి మాట్లాడే ముందు గత ప్రభుత్వ హయాంలో గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు.

జీవో నెం. 3 విషయంలో కూడా వైసీపీ వైఖరిపై మంత్రి ప్రశ్నలు సంధించారు. జీవో నెం. 3 రద్దయిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. గిరిజన ఉద్యోగ, విద్యా హక్కులపై అప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలు మరచిపోలేదన్నారు.

జీవో నెం. 3 అయినా, డీఎస్సీ అయినా, గిరిజనుల సమస్య ఏదైనా వైసిపి పార్టీ ఆలస్యంగానే స్పందిస్తుందని మంత్రి విమర్శించారు. సమస్యలు వచ్చినప్పుడు ముందుండి పరిష్కారం కోసం పనిచేయాల్సిన ప్రతిపక్షం రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజనులను రెచ్చగొట్టడం సరికాదన్నారు.

ప్రతిపక్ష నేత ఎక్కడ ఉన్నారో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి ఉందని, "ఆయన తాడేపల్లిలో ఉంటాడో.. బెంగళూరులో ఉంటాడో ఎవరికీ తెలియదు" అని మంత్రి ఎద్దేవా చేశారు.

గిరిజనుల భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. గిరిజనులు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు.

# డేట్.. టైమ్ ఫిక్స్ చెయ్.. డిబేట్‌కు రెడీ!

(మొదటి పేజీ తరువాయి)

మరో 3 డిఎస్సీలు పారదర్శకంగా నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తాం.

**ఈ స్టేట్ మెంట్ ప్రజల కోసం మాత్రమే... :** ఈ స్టేట్ మెంట్ ప్రతిపక్ష పార్టీకి సమాధానం కాదు, ఒక మంత్రిగా ఆంధ్రరాష్ట్ర ప్రజలకు డిఎస్సీ ఎలా నిర్వహించామో తెలియజేయాల్సిన బాధ్యత నాపై ఉన్నందున ఈ ప్రకటన చేస్తున్నా. డిఎస్సీని పారదర్శకంగా ఎలా నిర్వహించామో, రాబోయే రోజుల్లో ఎలా ముందుకు తీసుకెళ్లబోతున్నామో పుస్తకరూపంలో సభ్యుల ముందు ఉంచాం. దాంతోపాటు మెగా డిఎస్సీపై ఉన్న అపోహలు – వాస్తవాలను పొందుపరిచాం. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటా గురించి డీటైల్డ్ గా సమాధానం ఇవ్వడం జరిగింది. డిఎస్సీ నిర్వహణను ఒక బాధ్యతగా ప్రజాప్రభుత్వం తీసుకుంది. 2024 ఎన్నికలకు ముందు టిడిపి, జనసేన, బిజెపిలు కలసికట్టుగా ప్రతిఏటా డిఎస్సీ నిర్వహిస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం. మొదటిది మెగా డిఎస్సీ నిర్వహిస్తామని ఆనాడు హామీ ఇచ్చాం. అందులో భాగంగా డిఎస్సీ– 2025 ద్వారా 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటించాం. దీనికోసం 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. మొత్తం ప్రక్రియను 148రోజుల్లో పూర్తిచేయడం జరిగింది.

**ఎన్టీఆర్ హయాం నుంచి చంద్రబాబు వరకు.. :** ఎన్టీఆర్ నాయకత్వంలో 1983లోనే మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చారు. బీసీలు, ఎస్సీల కోసం వేర్వేరుగా ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసింది అన్న ఎన్టీఆర్. మహిళల కోసం తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలంటే టీచర్ రిక్రూట్ మెంట్ చేయాలని నిర్ణయించారు. టీచర్ నియామకం, బదిలీ గతంలో జడ్ పి చైర్మన్ చేతిలో ఉండేది. పంచాయితీరాజ్ వ్యవస్థలో ఉన్న వారందరినీ గవర్నమెంట్ సిస్టమ్ లోకి తీసుకొచ్చి ఎప్పుడూ లేనివిధంగా పకడ్బందీగా నియామకాల ప్రక్రియ చేపట్టడం జరిగింది. అంతేగాకుండా మహిళలకు డిఎస్సీలో 33శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత టిడిపిది. కౌన్సిలింగ్ విధానం ద్వారా టీచర్ ట్రాన్స్ ఫర్స్ ను పారదర్శకంగా ఆనాడు చేపట్టడం జరిగింది.

**టిడిపి హయాంలోనే 1.80లక్షల టీచర్ పోస్టులు :** 1994లో డిఎస్సీ విధానం తీసుకువచ్చాం. అప్పటినుంచి ఒక్క టిడిపి హయాంలోనే 1.80లక్షలమంది టీచర్లను నియమించాం. అదీ ప్రభుత్వ పాఠశాలలపై మాకున్న చిత్తశుద్ధి. 2019–24వరకు ఒక్క టీచర్ రిక్రూట్ మెంట్ జరగలేదు. 12లక్షలమంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. ఉపాధ్యాయులను మనందరం గౌరవించాలి. ఉపాధ్యాయులను ఈరోజు కూటమి ప్రభుత్వం సింగపూర్, ఫిన్లాండ్ కు శిక్షణ కోసం పంపితే, గతప్రభుత్వం టీచర్లను ఏకంగా వైన్ షాపుల ముందు నిలబెట్టింది. గత ప్రభుత్వం తెచ్చిన జిఓ



117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు చాలా తీవ్రంగా నష్టపోయాయి. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి వన్ క్లాస్ వన్ టీచర్ కేవలం 3 నుంచి 4శాతం పాఠశాలల్లోనే ఉండేది.

**యువగళం పాదయాత్రలో వచ్చిన ఆలోచనే మెగా డీఎస్సీ :** యువగళం పాదయాత్ర సమయంలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం ప్రాంతాల్లో వందలమంది వ్యవసాయ కూలీలు తమ పిల్లలతో పాటు వాహనాల్లో పనుల కోసం గుంటూరు వలస వచ్చేవారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు లేరు, పిల్లలను స్కూలుకు పంపించినా చదువుకోలేని పరిస్థితి. మెగా డిఎస్సీ ఏర్పాటుచేసి, కర్నూలు జిల్లాకు అవసరమైనంత టీచర్లను నియమించాలని ఆనాడు నిర్ణయించుకున్నా. అందులో భాగంగానే మెగా డిఎస్సీలో ఎంపికైన టీచర్లలో 10శాతం మందిని కర్నూలు జిల్లాకే కేటాయించాం. రాబోయే డిఎస్సీలో కూడా మరింతమంది టీచర్లను కర్నూలు జిల్లాలో నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**మెగా డీఎస్సీ ఇలా నిర్వహించాం :** మెగా డిఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు రిక్రూట్ చేశాం. ఇందుకోసం 3,36,300 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు చేశారు. 154 ఎగ్జామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇందులో 19 సెంటర్లను రాష్ట్రేతర ప్రాంతాల్లో ఏర్పాటుచేశాం. 13 సబ్జెక్టులపై 42వేల ప్రశ్నలతో క్వశ్చన్ బ్యాంక్ తయారుచేశాం. 148 రోజుల్లో ప్రక్రియ పూర్తిచేసి 15,941 టీచర్లకు పెద్ద కార్యక్రమం ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో ఆర్డర్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది. 24రోజుల్లో 89 టెస్ట్ సెషన్లు నిర్వహించాం. అభ్యర్థుల అనుమానాల నివృత్తికి రిడ్రెసెల్ మెకానిజం ఏర్పాటుచేశాం. టెట్, డిఎస్సీపై అభ్యర్థుల అనుమానాల నివృత్తికి ప్రత్యేక సెల్ ఏర్పాటుచేశాం. ఇందులో తమ దృష్టికి తెచ్చిన 33,830 ప్రశ్నలకు సమాధానాలు చెప్పాం. అవిగాక 11,130 గ్రీవెన్స్ ను పరిష్కరించాం.

**వందల కేసులు వేసినా 148రోజుల్లో ప్రక్రియ పూర్తిచేశాం :** మెగా డీఎస్సీపై భిన్నాభిప్రాయాలు ఉన్న వ్యక్తులు 336 కేసులు కోర్టులో ఫైల్ చేశారు. అన్నింటినీ న్యాయబద్ధంగా పరిష్కరించి 148రోజుల్లో 12దశల్లో రిక్రూట్ మెంట్ ప్రక్రియను పూర్తిచేశాం. మొదటిది టెట్ నోటిఫికేషన్, నిర్వహణ. తర్వాత డిఎస్సీ నోటిఫికేషన్ డిస్ట్రిక్ట్ మేనేజ్ మెంట్ వైజ్. తర్వాత వెబ్ బేస్డ్ ఆన్ లైన్ అప్లికేషన్ స్వీకరణ, క్వశ్చన్ పేపర్ సెట్టింగ్, టిసిఎస్ అయాన్, ఇది ఒక సెక్యూర్డ్ టెస్టింగ్ ప్లాట్ ఫాం. ఎగ్జామినేషన్ నిర్వహణ, ట్రాన్సఫరెంట్ మెకానిజం ద్వారా అభ్యర్థులకు స్కోర్ తెలియజేయడం, జోన్ ఆఫ్ కన్సిడరేషన్ ఉన్నవారిని పిలిచి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహణ, వర్టికల్ హారిజంటల్ రిజర్వేషన్. ఈ విధానం అమలు చేయాలని ప్రత్యేకంగా జడ్జిమెంట్లు కూడా ఉన్నాయి. భారతదేశ చరిత్రలో వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ అమలుచేసింది ఎన్ డిఎ ప్రభుత్వం. గ్రీవెన్స్ రిడ్రసల్ మెకానిజం, ఫైనల్ సెలక్షన్, అపాయింట్ మెంట్, కోర్టు కేసుల పరిష్కారం చేశాం. టెట్ నోటిఫికేషన్ కు వచ్చేసరికి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ గైడ్ లైన్స్ లో కంపల్సరీగా టెట్ క్వాలిఫై కావాలని ఉంది. ఇందుకోసం టెట్ మ్యాండేట్ చేసి 20శాతం వెయిటేజ్ ఇచ్చాం. టెట్ కు 3,68,661 మంది దరఖాస్తు చేస్తే 1,87,256 మంది క్వాలిఫై అయ్యారు. దీనిని కూడా పారదర్శకంగా నిర్వహించాం. ఈ సంవత్సరం కూడా టిసిఎస్ అయాన్ ద్వారా ఎక్కడా ఎలాంటి టెక్నికల్ సమస్యరాకుండా పకడ్బందీగా టెట్ పారదర్శకంగా పూర్తిచేశాం. టెట్ అయిన తర్వాత డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. ఎస్సీ సోదరుల వర్గీకరణ వచ్చినపుడు ఆ ప్రక్రియ పూర్తిచేసి, జిఎడి ద్వారా ఆర్డర్ వచ్చిన తర్వాత ప్రక్రియ చేపట్టాం.

**క్రీడలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ నిర్ణయం :** స్పోర్ట్స్ ను పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నది ప్రజాప్రభుత్వ నిర్ణయం, గౌరవ ప్రధాని మోదీ ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ రావాలి, యువకులు స్పోర్ట్స్ ను ప్రొఫెషన్ గా తీసుకోవాలి, రిటైరైనపుడు వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని స్పష్టంగా చెప్పారు. ఈ మేరకు కేంద్రంలో అద్భుతమైన పాలసీ తెచ్చారు. ఆ పాలసీనే మనం అడాప్ట్ చేసుకున్నాం. గతంలో 29 కేటగిరిలు ఉంటే కేంద్రప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం 65 స్పోర్ట్స్ కేటగిరిలు మనం ఎడాప్ట్ చేసుకున్నాం. తర్వాత టీచర్ రిక్రూట్ మెంట్ టెస్ట్ (టిఆర్ టి) కూడా పారదర్శకంగా నిర్వహించి, స్కీమ్ ఆఫ్ సెలక్షన్ పారదర్శకంగా నిర్వహించాం. దాని తర్వాత మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. మెగా డిఎస్సీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని వైసిపి నాయకులు 148రోజుల్లో 141 కేసులు వేశారు. సిఎంగారి తొలి సంతకం ముందుకు వెళ్లకూడదన్న లక్ష్యంతో వైకాపా నాయకులు కేసులువేశారు.

నోటిఫికేషన్ లీగల్ స్క్రూటినీలో ఫెయిలైతే సీరియస్ గా తీసుకుంటానని అధికారులకు చెప్పా. ఇప్పుడు సిఆర్ డిఎ కమిషనర్ గా ఉన్న విజయరామరాజు ఆనాటి పాఠశాల విద్యశాఖ కమిషనర్ గా ఉన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్స్ ఏ కారణంగా ఫెయిలయ్యాయో ఎఐ ద్వారా విశ్లేషించి ఒక మోడల్ నోటిఫికేషన్ తెచ్చాం. అందుకే ప్రతి లీగల్ స్క్రూటినీ మేం తట్టుకోగలిగాం. 141 కేసులు వేసినా డిఎస్సీ పూర్తి చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చి, టీచర్లకు శిక్షణ ఇచ్చి స్కూళ్లలో పెట్టిన ఘనత ప్రజాప్రభుత్వానిది. వైకాపా 2019 నుంచి 2024వరకు ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేదు. డిఎస్సీ నిర్వహించాలంటే కంప్యూటర్ బేస్డ్ టెస్టింగ్ జరగాలి. అది చేయాలంటే సరిపడా కంప్యూటర్ సెంటర్లు ఉండాలి. మనకు ప్రధానమైన సమస్య రాష్ట్రంలో సరిపడా సెంటర్లు లేవు. అభ్యర్థులందరికీ తమ జిల్లాలో పరీక్ష రాయాలనే కోరిక ఉంటుంది. శ్రీకాకుళం, ఇచ్చాపురం వాళ్లు కుప్పం వరకు వెళ్లలేరు. గోదావరి జిల్లాల వాళ్లు రాయలసీమ వెళ్లి రాయలేరు. ఇందుకోసం ఒక సాఫ్ట్ వేర్ రూపొందించి 87.8 శాతం మందికి వారి ఫస్ట్ చాయిస్ మేరకు డిఎస్సీ సిబిటి ఎగ్జామ్ కు టిసిఎస్ అయాన్ సెంటర్ కేటాయించాం. టిసిఎస్ అయాన్ సెంటర్లను కూడా ఫిజికల్ గా వెళ్లి తనిఖీచేయాలని ఆదేశించాం. సిసి టివి పనిచేస్తుందా, ఫుటేజి రికార్డు అవుతుందా అని పరిశీలించాం. మన పిల్లలు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉన్నందున 19 సెంటర్లను ఇతర రాష్ట్రాల్లో కూడా ఏర్పాటుచేశాం.

**నార్మలైజేషన్ కోసం సైంటిఫిక్ మెకానిజం :** నార్మలైజేషన్ కోసం ఒక సైంటిఫిక్ మెకానిజంను ఉపయోగించాం. దీనిపై కూడా వైసిపివాళ్లు చాలెంజ్ చేస్తే కోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. కోర్టు ఎగ్జామినేషన్ కే నార్మలైజేషన్ ఉన్నపుడు డిఎస్సీకి ఎందుకు ఉండకూడదని ప్రశ్నించి, ఆ కేసును డిస్మిస్ చేసింది. పారదర్శకంగా నార్మలైజేషన్ పాటించాం. గ్రీవెన్స్ రిడ్రసల్ కూడా పకడ్బందీగా నిర్వహించాం. ఆన్ లైన్ అప్లికేషన్ కూడా బెస్ట్ సాఫ్ట్ వేర్ తీసుకొచ్చాం. ఆధార్ బేస్డ్ ఓటిపి మెకానిజం ఏర్పాటుచేసి సెక్యూర్డ్ మెకానిజం పెట్టాం. క్వాలిఫికేషన్ బట్టి ఎగ్జామ్ రాయవచ్చు. కొంతమంది రెండు ఎగ్జామ్స్ రాశారు. ఫీజు కూడా ఆన్ లైన్ లో పారదర్శకంగా చెల్లించారు. అది నేరుగా డిపార్ట్ మెంట్ కు చేరగా, టిసిఎస్ అయాన్ కు పేమెంట్ చేశాం. డాక్యుమెంట్ వెరిఫికేషన్ టైమ్ టేకింగ్ ప్రాసెస్. నోటిఫికేషన్ సమయంలో డాక్యుమెంట్స్ అప్ లోడ్ చేయాలని చెప్పాం. అభ్యర్థుల విన్నపం మరకు ఫైనల్ సెలక్షన్ సమయంలో సర్టిఫికేట్లు చూపించే వెసలుబాటు కల్పించాం. ఏడెనిమిది సంవత్సరాలు డిఎస్సీ జరగనందున అభ్యర్థుల మనోభావాలకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహించాం. క్వశ్చన్ పేపర్ ఎలా తయారుచేశామో సభ్యులు తెలుసుకోవాలి. 42వేల ప్రశ్నలను ౹ాజజు౼ా నుంచి సబ్జెక్టు నిపుణులను తెచ్చి తయారు చేయించాం. ఏ సబ్జెక్ట్ ఎక్స్ పర్ట్ ఏ క్వశ్చన్లు తయారుచేశారు చేశారో ఆ డేటా మావద్ద ఉంది. ప్రోటోకాల్ మెయింటైన్ చేశాం, కాన్ఫిడెన్షియల్ రూం పెట్టాం. వాళ్లే టిసిఎస్ అయాన్ కు అప్ లోడ్ చేసే మెకానిజం ఏర్పాటుచేశాం. 89 టెస్ట్ సెషన్లు, 13సబ్జెక్టులు, 67రకాల పోస్టులు 24రోజుల్లో పూర్తిచేశాం.

## ఏఈ కుటుంబం ఆత్మ హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన వారిని గుర్తించి రక్షించేందుకు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అవసరమైతే జాతీయ విపత్తు స్పందన దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం బృందాల సేవలను వినియోగించాలని సూచించారు.

## చావలి వాలేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం



- **ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు**

**చావలి, ఆగస్టు 17:** వేమూరు నియోజకవర్గం చావలి గ్రామంలోని వాలేశ్వర స్వామి దేవాలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు హాజరై నూతన పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పాలక మండలి చైర్మన్‌గా లంకోజి మల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

నూతన పాలక మండలి సభ్యులుగా కల్వపూడి పాపారావు, బౌతుల సునీత, గోపాలం సత్యనారాయణ, ఇనంపూడి సరస్వతి, మన్నెం కస్తూరి, బెల్లంకొండ నాంచారమ్మ, సోమరౌతు శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఆలయ అర్చకుడు చావలి మణికంఠ ఎక్స్‌ఆఫీషియో సభ్యుడిగా కొనసాగనున్నారు. సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ నూతన పాలక మండలి సభ్యులు సమన్వయంతో పనిచేసి వాలేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 3వ దశకు చేరిన ఏపీ జూడా సమ్మె



**గుంటూరు, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** సముచితమైన స్టైపెండ్ పెంపు, ఇతర న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ జూడా చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె సోమవారం 8వ రోజుకు చేరుకుంది. మూడో దశలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసర సేవల నుంచి కూడా వైదొలిగారు. ఈ నెల 11న ప్రభుత్వ అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో పాటు, తదుపరి చర్చలకు ప్రభుత్వం నుంచి పిలుపు రాకపోవడంతో సమ్మెను మరింత తీవ్రతరం చేసినట్లు జూడా ప్రతినిధులు తెలిపారు.

గుంటూరు మెడికల్ కాలేజీలో ఇంటర్న్లు, పీజీ వైద్యులు, సూపర్ స్పెషాలిటీ పీజీలు, సీనియర్ రెసిడెంట్లు సమ్మెలో పాల్గొని జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో ఆందోళన కొనసాగించారు. స్వచ్ఛంద రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకోగా.. సోమవారం 15 మంది పీజీ వైద్యులు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు. నిరసనలో భాగంగా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కార్యక్రమాన్ని నిర్వహించి తమ డిమాండ్లను సృజనాత్మకంగా వ్యక్తం చేశారు.

ఆందోళనకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. మాజీ ఐఎంఏ అధ్యక్షుడు, మాజీ ఏపీఎంసీ సభ్యుడు డా. నాగళ్ల కిశోర్, ఐఎంఏ గుంటూరు చాప్టర్ అధ్యక్షుడు డా. సేవా కుమార్, కార్యదర్శి డా. సాయి కృష్ణ, జాయింట్ సెక్రటరీ డా. శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు డా. రాజేంద్ర తదితరులు జూడా ఆందోళన శిబిరాన్ని సందర్శించారు. వైద్య సమాజం జూనియర్ వైద్యుల న్యాయబద్ధమైన స్టైపెండ్ పెంపు డిమాండ్‌కు ఐక్యంగా మద్దతు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. చీవీజ నిబంధనల ప్రకారం మీషె,ాష్ట్రణ ఫ్యాకల్టీ నియామకాలు చేపట్టాలని, వైద్యుల పదవీ విరమణ వయస్సు పెంపును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వైద్యులపై హింసను అరికట్టడం, యాంటీ క్వాకరీ చర్యలను బలోపేతం చేయడం వంటి అంశాలపైనా మద్దతు ప్రకటించారు. అత్యవసర సేవల నుంచి వైద్యులు వైదొలగడంతో రోగులకు కలుగుతున్న అసౌకర్యానికి ఏపీ జూడా విచారం వ్యక్తం చేసింది. ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ప్రభుత్వం జూనియర్ వైద్యుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరింది. సమస్య పరిష్కారమై సమ్మె విరమించి పూర్తి స్థాయిలో రోగులకు సేవలందించే అవకాశం లభించాలని ఆకాంక్షించింది.

# పంటల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- **వర్షాభావ పంటలకే ప్రాధాన్యం**
- **పంటల రక్షణకు బీమా తప్పనిసరి**
- **నెలాఖరు వరకూ గడువు... బీమా నమోదులో ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలి**
- **పంటల బీమా వాటా గత ప్రభుత్వం చెల్లించలేదు... కూటమి ప్రభుత్వమే చెల్లింపు**
- **పోలవరం, పట్టిసీమతో నీటి భద్రత.. 36 ప్రాజెక్టులకు రూ.35,555 కోట్లు**
- **ఎల్‌నినోను ఎదుర్కొనేలా మూడేళ్ల కార్యాచరణపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు**
- **ఎల్‌నినోపై పంచసూత్రాలు రూపొందించినట్లు ప్రకటన**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, రైతులు పంటల ఎంపిక, నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పంటలకు ఆర్థిక రక్షణ ఉండాలంటే బీమా నమోదు చేయించుకోవాలని, అన్ని పంటలకూ బీమా చేయించే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. పంటల బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకూ గడువు ఉందని గుర్తు చేశారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వరి సాగు చేయవద్దని, ఉద్యాన, వర్షాభావ పంటలను రక్షించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులను ముఖ్యమంత్రి కోరారు. ఎల్ నినో ప్రభావంపై శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఎల్‌నినోపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పంచసూత్రాలు రూపొందించామని సీఎం తెలిపారు. రైతన్న మీకోసం యాక్షన్ కమిటీలు, పంటల బీమా నమోదు, హైరిస్క్ ప్రాంతాల్లో పశుగ్రాసం విత్తనాలు వేయడం, జలధార-2, రైతుల ఇబ్బందులను కనిష్ట స్థాయికి తగ్గించి జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరడం ఇందులో భాగమన్నారు. ఎల్‌నినో కోసం షార్ట్‌టర్మ్ ప్లానింగ్ సిద్ధం చేసుకున్నామని, పంటల పరిరక్షణ, సమర్థ నీటి నిర్వహణ, సేంద్రీయ సాగుపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

**ఎల్‌నినో ఎఫెక్ట్.. భారీ వర్షాభావం :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. సాధారణ వర్షపాతం కంటే తీవ్రమైన లోటు కనిపిస్తోందని, అసెంబ్లీ వేదికగా ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 2026 జూన్-డిసెంబర్ మధ్య 867 మి.మీ. వర్షపాతం పడాల్సి ఉండగా 557 మి.మీ. మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. జులైలో కొన్ని జిల్లాల్లో 68 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఆగస్టు, సెప్టెంబర్‌లో 35 శాతం చొప్పున, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం లోటు ఉండవచ్చన్నారు. డిసెంబర్‌లో మాత్రం ఒక శాతం అదనపు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

**శ్రీశైలానికి నీటి కొరత.. 214 టీఎంసీలే రాక :** వివిధ బేసిన్లలో జలాల లభ్యత తగ్గిపోతోందని సీఎం తెలిపారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీరు అడుగంటుతోందన్నారు. శ్రీశైలానికి 753 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా ఈసారి 214 టీఎంసీలు మాత్రమే వచ్చిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రిజర్వాయర్లు నిండిన తర్వాతే మన రాష్ట్రానికి నీరు వస్తుందని, దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు నీటి రాక తగ్గుతోందన్నారు. కావేరి జలాలపై తమిళనాడు-కర్ణాటక మధ్య వివాదంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుందని గుర్తుచేశారు. గ్రామాల మధ్య, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య కూడా నీటి సమస్యలు వస్తున్నాయని చెప్పారు.

**గోదావరిలోనూ తగ్గిన నీటి లభ్యత :** గోదావరి బేసిన్‌లోనూ నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. కాటన్ బ్యారేజీకి 2,557 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా 1,071 టీఎంసీలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. కృష్ణాతో పోలిస్తే గోదావరిలో కొంత మేర నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని, అందుకే పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించామని వివరించారు. గత రెండేళ్లలో సమర్థ నీటి నిర్వహణతో సుమారు 552 టీఎంసీల నీటిని పొదుపు చేయగలిగామని, అదే ఇప్పుడు శ్రీరామరక్షగా ఉందన్నారు. ప్రస్తుతం ప్రధాన రిజర్వాయర్లలో 586 టీఎంసీల నీరు ఉందని, భూగర్భజల మట్టాలు కూడా తగ్గుతున్నాయని చెప్పారు. గోదావరి బేసిన్‌లో తప్ప ఎక్కడ పంటలు వేసినా ఇబ్బందులు తప్పవు. దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి.. సహకరించాలి. క్షేత్రస్థాయిలో పొదుపు నీటిని వాడుకోకుంటే కష్టాలు వస్తాయి" అని హెచ్చరించారు.

**కృష్ణాలో వరి వద్దు.. వర్షాభావ పంటలకే ప్రాధాన్యం :** కృష్ణా, పెన్నా బేసిన్లలో నీటి లభ్యత తక్కువగా ఉంటుందని సీఎం తెలిపారు. గోదావరిలో కొంత మేర పరిస్థితి బాగున్నా అక్కడ కూడా సమర్థ నీటి నిర్వహణ అవసరమన్నారు. విడుదల చేసిన నీటిని సద్వినియోగం చేసుకోవాలని, తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, పరిశ్రమలకు నీరు అందించాలని సూచించారు. ఉద్యాన, వర్షాభావ పంటలు మాత్రమే సాగు చేయాలని చెప్పారు. పులిచింతలలో నీళ్లు అడుగంటిపోయాయి. గోదావరి జలాలు నిలిచిపోతే ఇబ్బందులు వస్తాయి. కృష్ణాలో వరి వేయొద్దు" అని సీఎం స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని రైతులకు వివరించాలని సూచించారు. కృష్ణా డెల్టా సహా ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ, చెన్నై వరకు 121.4 టీఎంసీల నీరు అవసరమవుతుందని చెప్పారు.

**పంటల విస్తీర్ణంలో మార్పులు :** ఎల్‌నినో ప్రభావం పంటలపైనే కాకుండా ద్రవ్యోల్బణంపైనా పడుతోందని సీఎం తెలిపారు. దేశ సగటుతో పోలిస్తే ఏపీకి నాలుగు రెట్లు తక్కువ వర్షపాతం పడుతోందన్నారు. నీటి నిర్వహణతో కొంత మేర పంటలను కాపాడుతున్నప్పటికీ పరిస్థితి తీవ్రంగా ఉందన్నారు. వరి విస్తీర్ణం 1.14 లక్షల హెక్టార్ల మేర తగ్గిందని, పప్పుధాన్యాలు మినహా మొక్కజొన్న, వేరుశనగ, చిరుధాన్యాల విస్తీర్ణం కూడా తగ్గిందన్నారు. సీమలో స్వీట్ ఆరెంజ్, బత్తాయి, యాసిడ్ లైమ్, మామిడి పంటలపై ప్రభావం పడుతుందని చెప్పారు. దక్షిణాంధ్రలో అరటి, మిరప విస్తీర్ణం తగ్గుతోందని, ఉత్తరాంధ్రలో జీడిమామిడి, కొబ్బరి తోటలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అవసరమైతే పంటలను కాపాడేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తామని, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. మిరప ఉత్పత్తిని తగ్గించమని కోరామని, ఆయిల్‌పామ్ సాగుకు ఇబ్బంది ఉండకపోవచ్చన్నారు.

**పంటల బీమాకు రికార్డు దరఖాస్తులు :** గత ప్రభుత్వం పంటల బీమాకు ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో కూటమి ప్రభుత్వమే చెల్లించింది అని సీఎం తెలిపారు. గతేడాది 19.50 లక్షల మంది బీమా నమోదు చేసుకోగా.. ఈ ఏడాది 35.17 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. నాన్‌లోనీ నమోదు గత ఖరీఫ్‌లో 2 లక్షలు ఉండగా ఈసారి పది రెట్లు పెరిగి 20.35 లక్షలకు చేరిందన్నారు. గతేడాది 7.83 లక్షల హెక్టార్లు పంట బీమా పరిధిలో ఉండగా.. ఈ ఏడాది 15.17 లక్షల హెక్టార్లు బీమా పరిధిలోకి వచ్చాయని చెప్పారు. మొత్తంగా రూ.13,983 కోట్ల బీమా చేయగలిగామని, ఇది దేశంలోనే ఐదో స్థానమన్నారు. అన్ని పంటలకు బీమా చేయించే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని, ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నందున రైతులందరూ బీమా నమోదు చేసుకోవాలని సీఎం సూచించారు.

సమర్థ నీటి నిర్వహణ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ప్రజా ప్రతినిధులు పరిస్థితిని అర్థం చేసుకుని ప్రజలను సిద్ధం చేయాలన్నారు. జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలు చేపట్టామని, ఎల్‌నినో లాంటి పరిస్థితులు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేలా మూడేళ్ల కార్యాచరణ చేపట్టామని చెప్పారు. ఆర్ఎస్‌కేల స్థాయిలో నీటి నిర్వహణ, ఎల్‌నినోపై రైతుల అప్రమత్తతకు చర్యలు తీసుకుంటున్నామని, మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ మోడల్ విధానం తారక మంత్రమని, వర్షాభావ పరిస్థితుల్లో ఈ విధానం ద్వారా ఇబ్బందులను తగ్గించవచ్చని చెప్పారు. పట్టిసీమ ఎందుకని, నీళ్లను ఎక్కడ పెట్టుకుంటారని నాడు ప్రశ్నించారని సీఎం గుర్తుచేశారు. పులిచింతల, సాగర్, శ్రీశైలం జలాలను సద్వినియోగం చేసుకునేందుకు పట్టిసీమ అవసరమని అప్పుడే చెప్పామని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు 500 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకొచ్చామని, 13 లక్షల ఎకరాలకు పైగా ఉన్న కృష్ణా డెల్టా ఆయకట్టుకు పట్టిసీమ కీలకంగా మారిందన్నారు. మరో 40 టీఎంసీల నీటిని పట్టిసీమ ద్వారా తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**36 ప్రాజెక్టులకు రూ.35,555 కోట్లు :** 36 ప్రాజెక్టులను రూ.35,555 కోట్లతో నిర్మించేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని సీఎం తెలిపారు. ఇవి పూర్తయితే 19.16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందుతుందని, మరో 9 లక్షల ఎకరాలకు పైగా స్థిరీకరణ చేయవచ్చన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, ఏ ఒక్క ప్రాంతానికో పరిమితమయ్యే ప్రాజెక్టు కాదన్నారు. పోలవరంతో గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకువస్తున్నామని, ఎడమ కాల్వ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. వేయి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో కలుస్తోందని, వృథాగా పోతున్న నీటిలో 30-40 టీఎంసీలను విశాఖకు తీసుకురావడం కష్టం కాదన్నారు. విశాఖ పారిశ్రామిక అవసరాలు, డేటా సెంటర్లకు నీరు అందిస్తామని చెప్పారు.

**వెలిగొండతో 30 ఏళ్ల కల సాకారం :** వెలిగొండ ప్రాజెక్టును త్వరలో ప్రారంభించబోతున్నామని సీఎం తెలిపారు. 30 ఏళ్ల చిరకాల కోరికను తీర్చబోతున్నామని చెప్పారు. కరవు ప్రాంతమైన మార్కాపురం జిల్లాను కాపాడుతామన్నారు. పోలవరం పూర్తయితే కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని డ్రా చేసుకోవచ్చన్నారు. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ పనులను 100 రోజుల్లో పూర్తి చేశామని తెలిపారు. 2014-19 మధ్య ఇరిగేషన్ కోసం రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం రూ.20 వేల కోట్ల కంటే తక్కువే ఖర్చు చేసిందని, దీంతో ఇరిగేషన్ దెబ్బతిందని సీఎం విమర్శించారు. 2028 డిసెంబర్ నాటికి ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ఏడాది 20 వేల గోకులం షెడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని సీఎం తెలిపారు. డెయిరీ రంగంలో ఉత్పత్తి పడిపోకుండా చూడాలని, పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డెయిరీ రంగంపై అనేక మంది ఆధారపడి ఉన్నందున దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'రైతన్న మీ కోసం' పేరుతో స్థానిక కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ఉన్న వారందరినీ భాగస్వాములను చేశామని చెప్పారు. ఈ ఏడాది ఎల్‌నినోను ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు వచ్చినా శాశ్వతంగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలి. నీటిని పొదుపుగా వినియోగించడం, సరైన పంటలను ఎంచుకోవడం, ప్రతి పంటకు బీమా చేయించడం, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలి అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# జూడా స్టైఫండ్‌పై సర్కారు చిత్తశుద్ధితో చర్చలు

- **15 శాతం స్టైఫండ్ పెంపు డిమాండ్... ఏటా రూ.87.91 కోట్ల భారం**
- **ఏటా నిర్దిష్ట శాతం పెంపునకు ప్రభుత్వం యోచన**
- **చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం**
- **సమ్మె విరమించి రోగులకు అండగా నిలవండి**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జూనియర్ డాక్టర్ల స్టైఫండ్ పెంపు డిమాండ్‌పై ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు కొనసాగిస్తోందని, ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అందుతున్న స్టైఫండ్‌పై 15 శాతం పెంపు చేయాలని ఏపీజూడా డిమాండ్ చేస్తోంది. అయితే ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఒకేసారి 15 శాతం పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న ప్రభుత్వం.. ప్రతి ఏడాది ఇంటర్న్లు, పీజీ విద్యార్థులకు నిర్దిష్ట శాతంలో పెంపు చేసే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. 9,501 మంది ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్లు, పీజీ, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ తదితర కోర్సుల విద్యార్థులకు ప్రస్తుతం నెలకు సుమారు రూ.48.84 కోట్లు, ఏడాదికి రూ.586.08 కోట్లు స్టైఫండ్‌గా ప్రభుత్వం చెల్లిస్తోంది.

ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్లకు నెలకు రూ.25,906, పీజీ మొదటి సంవత్సరం వారికి రూ.60,823, రెండో సంవత్సరం రూ.61,528, మూడో సంవత్సరం రూ.64,767 చెల్లిస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు కోర్సు సంవత్సరాన్ని బట్టి రూ.80,500 నుంచి రూ.85,100 వరకు అందుతోంది. 2018, 2020, 2022, 2024లో స్టైఫండ్ పెంపులు జరిగాయని, 2020, 2022, 2024లో 15 శాతం చొప్పున పెంచినట్లు అధికారులు తెలిపారు. 2026లో మరో పెంపునకు అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలిస్తోంది. 15 శాతం పెంచితే ఇంటర్న్ల స్టైఫండ్ రూ.29,792కు, పీజీ మొదటి సంవత్సరం వారికి రూ.69,946కు, సూపర్ స్పెషాలిటీ మొదటి సంవత్సరం వారికి రూ.92,575కు చేరుతుంది. దీనివల్ల ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ.87.91 కోట్ల అదనపు భారం పడుతుంది. 3 శాతం పెంపునకు రూ.17.58 కోట్లు, 5 శాతానికి రూ.29.30 కోట్లు, 10 శాతానికి రూ.58.61 కోట్లు అదనంగా ఖర్చవుతాయి.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎంబీబీఎస్ ఇంటర్న్ల స్టైఫండ్ ఆంధ్రప్రదేశ్‌లో రూ.25,906గా ఉండగా.. కర్ణాటకలో రూ.30 వేలు, తెలంగాణలో రూ.29,792, తమిళనాడులో రూ.27,319, కేరళలో రూ.27,300గా ఉంది. అయితే అన్ని కోర్సులు, అన్ని విభాగాల్లోనూ ఏపీలో స్టైఫండ్ తక్కువగా ఉందని చెప్పడం సరికాదని అధికారులు పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు ఏపీలో ఇస్తున్న మొత్తం కర్ణాటక, కేరళ, తమిళనాడు కంటే ఎక్కువగా, తెలంగాణ కంటే తక్కువగా ఉందని తెలిపారు.

స్టైఫండ్ పెంపుపై ఏపీజూడాతో జులై 17 నుంచి ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తోంది. తాజాగా ఆగస్టు 15న కూడా చర్చలు జరిపి 15 శాతం డిమాండ్‌పై పునఃపరిశీలన చేయాలని, విధులకు హాజరై వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని కోరింది. అయితే ఏపీజూడా ఆగస్టు 17 నుంచి సమ్మెకు వెళ్లింది.

జూనియర్ డాక్టర్ల ఆందోళన నేపథ్యంలో రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చోట అదనపు వైద్యులను సిద్ధంగా ఉంచుతున్నారు. అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ప్రసూతి సేవలు, ఆపరేషన్ థియేటర్లు, ఎన్ఐసీయూ, పీఐసీయూ, డయాలసిస్, ట్రామా సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు చేపట్టారు.

ఆగస్టు 11న ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో 32,575 ఓపీ, 2,398 ఐపీ కేసులు, 2,647 సర్జరీలు జరగగా.. 12న 33,035 ఓపీ, 2,085 ఐపీ, 2,589 సర్జరీలు నమోదయ్యాయి. 13న 34,442 ఓపీ, 1,159 ఐపీ కేసులు, 2,122 సర్జరీలు, 147 డెలివరీలు జరిగాయి.

ప్రభుత్వ వైద్య వ్యవస్థలో జూనియర్ డాక్టర్లు కీలక భాగమని, వారి పని భారం, బాధ్యతలు, స్టైఫండ్ పెంపు డిమాండ్‌ను ప్రభుత్వం గుర్తిస్తోందని అధికారులు తెలిపారు. చర్చలు కొనసాగుతున్నందున సమ్మెను విరమించి అత్యవసర సేవలు సహా రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఏపీజూడాను కోరారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన పీవీయన్ మాధవ్



- **నితిన్ నబిన్ హాజరు నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు**

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ పరిశీలించారు. రేపు జరగనున్న సమావేశానికి వేదికైన వైజాగ్ కన్వెన్షన్ హాల్, సమావేశ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

సమావేశ వేదిక, పార్కింగ్, నాయకుల రాకపోకలు, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై నిర్వాహకులు, సంబంధిత నాయకులతో మాధవ్ చర్చించారు. సమావేశం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలు తదితర కీలక అంశాలపై చర్చ జరగనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలిసారిగా విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మాధవ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన వివిధ విభాగాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి విభాగం తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, జాతీయ నాయకుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రమేష్ నాయుడు, దయాకర్, లక్ష్మీ ప్రసన్న, మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, జయప్రకాష్, ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, వినోద్ వర్మ, రొంగలి గోపీ శ్రీనివాస్, పరశురాం రాజు, సురేంద్ర మోహన్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోర్టుల ప్రైవేటీకరణకు 'నో'

(మొదటి పేజీ తరువాయి) విశాఖపట్నం గంగవరం, కాకినాడ యాంకరేజ్, కాకినాడ డీప్ వాటర్, రవ్వ, కృష్ణపట్నం పోర్టులు ఆపరేషనల్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. మరో ఐదు పోర్టులు నిర్మాణ దశలో ఉన్నాయని, మూలాపేట, AMNS (ఆర్సెల్లార్ మిట్టల్-నిప్పన్ స్టీల్), కాకినాడ గేట్‌వే, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు నిర్మాణంలో ఉన్నట్లు వివరించారు.

ఇతర నోటిఫైడ్ పోర్టులు ఆరు ఉన్నాయని మంత్రి వెల్లడించారు. కళింగపట్నం, భీమునిపట్నం, నరసాపురం, ఓడరేవు, నిజాంపట్నం, నక్కపల్లి నోటిఫైడ్ పోర్టులుగా ఉన్నాయని తెలిపారు. రాంబిల్లిలో నావల్ ప్రత్యామ్నాయ ఆపరేటింగ్ బేస్ ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని పోర్టులను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేటీకరణకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని, అందువల్ల రాష్ట్ర పోర్టుల ప్రైవేటీకరణ అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని తేల్చి చెప్పారు.

# రెండు దశాబ్దాల నిరీక్షణకు త్వరలో తెర

- **మంత్రి నారా లోకేష్ చొరవతో యర్రబాలెం అసైన్డ్ భూముల లబ్ధిదారులకు కలుగనున్న ఊరట**

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం అసైన్డ్ భూ యజమానులు రెండు దశాబ్దాల నిరీక్షణకు ఎట్టకేలకు తెర పడనుంది. మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో అసైన్డ్ భూమి లబ్ధిదారులకు ఊరట కలగనుంది. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ ఈ నెల 12 వ తేదీన సిఆర్డిఏ కమిషనర్ కు లేఖ కూడా రాసారు.

మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం గ్రామం లోని సర్వే నంబరు 774లోని 30.72 ఎకరాల భూములు ఆర్ఎస్ఆర్ ప్రకారం చెరువు పోరంబోకు భూమిగా నమోదయి ఉంది. అయితే 1924 - 1926 మధ్య అసైన్డ్ మెంట్ చేశారు. పది సంవత్సరాలు పాటు భూములను యజమానులు విక్రయించరాదని కండీషన్ పట్టాలు ఇచ్చారు. 1936 నుంచి వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ లు జరిగాయి. ఈ నేపథ్యంలో గత 2007 లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రిగా కొనసాగిన వైయస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అసైన్డ్ భూములలో భాగంగా ఎర్రబాలెం లోని సర్వే నంబర్ 774 కు కూడా ఆ జాబితాలో చేర్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి ఆ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అయితే అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా సర్వేనెంబర్ 774లోని భూములను కూడా సిఆర్డిఏ కి అప్పగించారు. ఎంతోమంది పేదలు అప్పటికే ఆ భూములను కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా మరికొందరు భవిష్యత్తులో ఇళ్లు నిర్మించేందుకు స్థలాలను ఖాళీగానే ఉంచారు. అయితే ఆ భూముల రిజిస్ట్రేషన్ లు నిలిచిపోయినా కొనుగోలు, అమ్మకాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమం లో ప్రభుత్వం తాగునీటి పైపు లైన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ లు, విద్యుత్ సదుపాయం కూడా కల్పించారు. ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. నిషేధిత 22 ఏ భూముల జాబితా నుంచి తొలగించి పూర్తి హక్కులు కల్పించాలని ఇటీవల కొందరు అసైన్డ్ భూముల యజమానులు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ను కలసి విన్నవించారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశా లు జారీ చేశారు. అయితే అప్పటికే కొన్ని భూముల్లో పలు నివాస గృహాలు ఉండడంతో ఆర్ వన్ జోన్ గా ప్రకటించారు. ఈ భూముల్లో 50 మీటర్ల వెడల్పు తో సీ 3డీ రహదారి నిర్మాణం చేపట్టారు. షుమారు 40 మంది ప్లాట్ల యజమానులు భూములు కోల్పోతున్నారు. అయితే సీఆర్డీఏ వారు ప్లాటు కు ప్లాటు కేటాయించడం తో



పాటు మిగిలిన భూములను కూడా 22 ఏ జాబితా నుంచి తొలగించే విధంగా రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ ఈ నెల 12 వ తేదీన సిఆర్డిఏ కమిషనర్ కు లేఖ కూడా రాసారు. వీలైనంత త్వరలోనే యర్రబాలెం అసైన్డ్ భూ యజమానుల రెండు దశాబ్దాల సమస్య పరిష్కారం కానుంది.

# వెలుగురాళ్ల తండాలో ఉచిత మెడికల్ క్యాంప్

- బడంగ్‌పేట శ్రీ సత్యసాయి సేవా సమితి భజన మండలి ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్



**కడ్తాల్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం గడ్డమీద తండా గ్రామపంచాయతీ పరిధిలోని వెలుగురాళ్ల తండాలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ వనస్థలిపురం సహకారంతో బడంగ్‌పేట శ్రీ సత్యసాయి సేవా సమితి భజన మండలి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ,లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు, స్థానిక సర్పంచ్ చిట్టి రమేష్ నాయక్ సహకారంతో గ్రామస్థులకు బీపీ,షుగర్ పరీక్షలతో పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నకిలీ,కల్తీ ఆహార పదార్థాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజూ తగినంత మంచినీరు తీసుకోవడంతో పాటు ఆకు కూరలు, కూరగాయలను శుభ్రంగా ఉడికించి తీసుకోవాలని,సమతుల్య ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. సమాజ సేవలో భాగంగా నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో శ్రీ సత్యసాయి సేవా సమితి బడంగ్‌పేట భజన మండలి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమ న్నారు. భవిష్యత్తు లోనూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొని రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన వంతు సహకారం అందిస్తామని దశరథ్ నాయక్ తెలిపారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రియా రమేష్ నాయక్,మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్,శ్వేత భూనాథ్ నాయక్,నాయకులు సరియా నాయక్,అమ్రియా నాయక్,రవి,గోపాల్,ఫుల్‌సింగ్తో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నవ వధూవరులకు కాంగ్రెస్ నాయకుల ఆశీస్సులు



**కడ్తాల్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్పీ ఫంక్షన్ హాల్‌లో జాటోవత్ కుటుంబ సభ్యుల పెళ్లి పిలుపు మేరకు నిర్వహించిన వివాహ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజలి వెడ్స్ కళ్యాణ్ నవ వధూవరులను కాంగ్రెస్ నాయకులు ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట్ల నరసింహ ముదిరాజ్,ఆమనగల్ మాజీ ఎంపీపీ శిరోలి పంతు నాయక్,కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు సభావత్ బీచ్య నాయక్,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు అర్కోటం బాలరాజు,రమేష్ నాయక్ తదితరులు పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించారు.

## శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుల్లెట్ల కలకలం

**శంషాబాద్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుల్లెట్ల సంచలనం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమైన ఒక ప్రయాణికుడి చేతి బ్యాగేజ్‌లో లైవ్ బుల్లెట్లను భద్రతా సిబ్బంది గుర్తించారు. విమానాశ్రయంలోని డిపార్చర్ టెర్మినల్ వద్ద సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా సిఐఎస్ఎఫ్ అధికారులు ప్రయాణికుడి లగేజీలో అనుమానాస్పద వస్తువులను గమనించారు. వెంటనే అలర్ట్ అయిన అధికారులు సదరు బ్యాగ్‌ను భౌతికంగా తనిఖీ చేసి, అందులో ఉన్న సజీవ బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. బుల్లెట్లు లభ్యం కావడంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో కాసేపు కలకలం రేగింది. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం అధికారులు తక్షణమే ఆ ప్రయాణికుడిని విమానం ఎక్కకుండా అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి వద్ద లభించిన బుల్లెట్లకు సంబంధించి ఎలాంటి లైసెన్స్ లేదా అనుమతి పత్రాలు ఉన్నాయా అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ప్రయాణికుడు సమగ్ర ఆధారాలు చూపించలేకపోవడంతో అతడిని ఆర్‌జిఐఎ లోకల్ పోలీసులకు అప్పగించారు. ఎయిర్‌పోర్టు నిబంధనల ప్రకారం ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తీసుకువెళ్లడం తీవ్రమైన నేరం కావడంతో, ఆర్‌జిఐఎ పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ప్రయాణికుడు ఎక్కడి నుంచి వచ్చాడు, ఈ బుల్లెట్లు అతడి వద్దకు ఎలా వచ్చాయి, పొరపాటున బ్యాగ్‌లో ఉండిపోయాయా లేక వెనుక ఏమైనా దురుద్దేశం ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని, ప్రయాణికులు తమ లగేజీ పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## కడ్తాల్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీడీవో సుజాత నాయక్



**కడ్తాల్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత నాయక్ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మండలానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు అందరూ పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించి,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులు,ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుజాత నాయక్ కోరారు.

## అంబేద్కర్‌కు ఘనంగా జ్ఞాన మాల సమర్పణ

- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు నత్తి మైసయ్య



**బోడుప్పల్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కి 391 ఆదివారం జ్ఞాన మాల సమర్పణ కార్యక్రమం ఆదివారం ఉదయం 9:30 గంటలకు బోడు ప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. అంబే ద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు నత్తి మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చదువు, సంఘ సంస్కరణల ద్వారా సమాజానికి కొత్త వెలుగు చూపారు. 'చదువు పులి పాలు లాంటిది' అని ఆయన చెప్పిన మాటలు నేటికీ యువతకు స్ఫూర్తి. ఆయన కలలు గన్న సమానత్వ, సౌభ్రాతృత్వ సమాజ స్థాపన కోసం మనమందరం కలిసి కృషి చేయాలి అని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యు లు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా జాతీ య గీతాన్ని పాడుతూ కార్యక్రమన్ని జై భీమ్ అనే నినాదంతో ముగించారు.

## అఖిల గాండ్ల తేలికుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఖైరతాబాద్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** అఖిల గాండ్ల తేలికుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సప్తగిరి నగర్ సామాజిక భవనంలో రామకృష్ణయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. సుదీర్ఘ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా కండకంట్ల కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీగా వీరంపల్లి విజయ్‌కుమార్, కోశాధికారి గా అనిశెట్టి మల్లేశ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 15 మంది సభ్యులు వివిధ పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోకాపేటలో గాండ్ల తేలికుల సంఘానికి కేటాయించిన ఒక ఎకరం స్థలంలో ఆగస్టు వారంలో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్లను ఆహ్వానించాలని నిర్ణయించారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం నూతన కమిటీ సమష్టిగా పనిచేస్తుందని నాయకులు తెలిపారు.

## బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** బోనాల పండుగ సందర్భంగా ఉమ్మడిహయత్‌నగర్ డివిజన్‌లోని పలు అమ్మవారి ఆలయాలను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కాలనీ,బంజారా కాలనీ,కట్ట మైసమ్మ దేవాలయం, పెద్దమ్మ దేవాలయం, బృందావన్ కాలనీలోని అమ్మవారి ఆలయాలను ఆయన సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ప్రశాంతంగా, సంతో షంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాని శ్రీనివాస్,శ్రీధర్ రెడ్డి, ఇట్టబోయిన నర్సింహా, అరుణ్, బీజేవైఎం జిల్లా నాయకులు ఎర్ర ప్రేమ్, నాగరాజు, ఆలయ కమిటీసభ్యులు, కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండి జబ్బర్ లాల్ ఆత్మహత్య కేసులో ముగ్గురికి రిమాండ్

- కడ్తాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదీ రెడ్డి



**కడ్తాల్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామానికి చెందిన జబ్బర్ లాల్ (28) ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను కడ్తాల్ పోలీసులు అరెస్టు చేసి,న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. మైసిగండి గ్రామానికి చెందిన జబ్బర్ లాల్,ఎస్.చందులాల్ కుమారుడు ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కడ్తాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ బి.ఎస్.ఎస్.వరప్రసాద్ దర్యాప్తు నిర్వహించారు. పోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. మృతుడి భార్య ముడావత్ ఏ జర్పుల సంగీతకు దీపావత్ నితిన్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ విషయంతో పాటు సంగీత,నితిన్,నితిన్ తల్లి జ్యోతి వ్యవహారశైలి,మాటల కారణంగా జబ్బర్ లాల్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు, తద్వారా ఆత్మహత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో A-1 ముడావత్ ఏ జర్పుల సంగీత,A-2 దీపావత్ నితిన్,A-3 దీపావత్ జ్యోతిలను నిందితులుగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా,కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం వారిని జైలుకు తరలించినట్లు తెలిపారు.

**- మానసిక వేధింపులు,బెదిరింపులపై కఠిన చర్యలు**

ఈ సందర్భంగా కడ్తాల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.సైదిరెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ,వివాహ సంబంధ వివాదాల నేపథ్యంలో ఇతరులను మానసికంగా వేధించడం, అవమానించడం,బెదిరించడం లేదా జీవితంపై విరక్తి కలిగించే విధంగా ప్రవర్తించడం తీవ్రమైన విషయమని తెలిపారు. ఎవరినైనా ఆత్మహత్యకు ప్రేరేపించే విధంగా చర్యలకు పాల్పడినట్లు ఆధారాలు లభిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

కుటుంబ జీవితంలో తలెత్తే సమస్యలు,వివాహ సంబంధ వివాదాలను బెదిరింపులు,దూషణలు,మానసిక వేధింపులు లేదా ప్రతీకార చర్యలతో మరింత తీవ్రతరం చేయవద్దని పోలీసులు సూచించారు. భార్యాభర్తల మధ్య లేదా కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు తలెత్తినప్పుడు పరస్పరం మాట్లాడుకోవడంతో పాటు కుటుంబ పెద్దలు,నిపుణుల కౌన్సెలింగ్ ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని తెలిపారు. ఎవరినైనా నిరంతరం అవమానించడం,బెదిరించడం లేదా మానసికంగా కుంగదీసే విధంగా ప్రవర్తించడం తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని,ఇటువంటి చర్యలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. వివాహ సంబంధమైన వ్యక్తిగత సమస్యల పేరుతో ఎవరైనా వేధింపులు,బెదిరింపులు లేదా ఆత్మహత్యకు ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తే బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కోరారు. కుటుంబ సమస్యలు,వ్యక్తిగత సంబంధాల కారణంగా ఎవరూ ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని,సమస్యలకు చట్టబద్ధమైన,శాంతియుత మార్గాల్లో పరిష్కారం వెతకాలని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి సూచించారు.

## వాజ్‌పేయి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**మల్కాజ్‌గిరి ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని వినాయక్‌నగర్‌లో ఘనంగా నివాళు లర్పించారు. మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి దేశ అభివృద్ధికి, ప్రజాసేవకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. రాజకీయాల్లో విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, దేశభక్తికి ఆయన ప్రత్యేక స్థానం కల్పించారని పేర్కొన్నారు. వాజ్‌పేయి ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. దేశం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ఓం ప్రకాష్, సాయి సురేష్ తదితరులు పాల్గొని వాజ్‌పేయికి నివాళులర్పించారు.

## పోచమ్మ, ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు



**సికింద్రాబాద్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** సికింద్రాబాద్ నగరంలో బోనాల ఉత్సవాల సందడి అంబరాన్నంటింది. మూడో ఆదివారం సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు నిర్వహించారు. సీతాఫల్మండి డివిజన్‌లోని పోచమ్మ-ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో సందడిగా మారాయి. పోచమ్మ--ముత్యాలమ్మ ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండేలా ఆశీర్వదించాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో కొనసాగించడం అభినందనీయమని అన్నారు. బోనాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను నెత్తిన పెట్టుకుని ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సామ్రాట్ మల్లికార్జున్, క్రాంతి గిరి, చందర్, ముఠా గణేష్, సాయిదత్తు, శ్రీరాములు తదితరులు పాల్గొని బోనాల వేడుకల్లో భాగస్వాములయ్యారు. బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ నిర్వాహకులను పలువురు అభినందించారు.

## పేదోడికి మరో పేదోడు అండ..సత్తి మానవత్వం

- మోకాళ్లపై నడుస్తున్న వ్యక్తికి ఆటో డ్రైవర్ అండ.
- అశోక్ అవస్థలు చూసి కదిలిన సత్తి మనసు. పేదోడి కన్నీటికి పేదోడే చేయూత.



**వికారాబాద్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** అనారోగ్యంతో నడవలేని స్థితిలో మోకాళ్లపై నడుచుకుంటూ ఆసుపత్రికి వెళ్తున్న ఓ వ్యక్తిని గమనించిన ఆటో డ్రైవర్ మానవత్వంతో స్పందించి, తన ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లి దింపాడు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ పలు మార్లు తన మానవత్వాన్ని చాటుకున్న ఆటో డ్రైవర్ సత్యనారాయణ, అలియాస్ సత్తి,మరోసారి స్థానికుల ప్రశంసలు అందుకున్నాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అశోక్ కొంత కాలంగా వికారాబాద్‌లో నివసిస్తూ రోజు వికారాబాద్ అడ్డపై కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. తోడుగా ఎవరూ లేకపోవడంతో వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లడం కూడా అశోక్‌కు కష్టంగా మారింది. ఆదివారం ఆసుపత్రికి వెళ్లేందుకు మోకాళ్లపై నడుచుకుంటూ రెండు కిలోమీటర్లు దూరం మోకాళ్లపై నడుచుకుంటూ ఇబ్బందులతో వెళ్తున్న అశోక్‌ను ఆటో డ్రైవర్ సత్యనారాయణ గమనించాడు. వెంటనే ఆటోను ఆపి అతడి పరిస్థితిని తెలుసుకున్నాడు. నడవలేని వ్యక్తిని అలా వదిలేయకుండా తన ఆటోలో ఎక్కించుకుని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి వద్దకు తీసుకెళ్లి సురక్షితంగా దింపాడు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం చేయడం సత్యనారాయణ మానవత్వానికి నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం చేయడం ఆయ నకు అలవాటుగా మారిందని పలువురు తెలిపారు. అశోక్‌కు అవసరమైన వైద్యం, మందులు, ఇతర సహాయాన్ని అందించేందుకు అధికారులు ముందుకు వస్తారా లేదా వేచి చూడాలి.

## ప్రముఖ సినీనటి శ్రీలీల చేతుల మీదుగా ఘనంగా పీహెచ్‌టీ మార్కెట్ ప్రారంభం

- 210 దుకాణాలతో ఉప్పల్‌లో నూతన వస్త్ర, ఆభరణాల మార్కెట్
- ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు నేరుగా సరసమైన ధరలకు నాణ్యమైన ఉత్పత్తులు



**ఉప్పల్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉప్పల్ బస్టాండ్ ఎదురుగా 210 దుకాణాలతో ఏర్పాటు చేసిన పీహెచ్‌టీ మార్కెట్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీనటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్‌ను ప్రారంభించారు. చేనేత, వస్త్రాలు, దుస్తులు, ఆభరణాలు తదితర ఉత్పత్తులు ఒకే చోట లభించేలా మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పీహెచ్‌టీ మార్కెట్ మేనేజింగ్ పార్ట్‌నర్స్ గడ్డం వెంకటేష్, గుజ్జ సత్యం, వనం నరసింహ, గోషిక కృష్ణ, చిరందాస్ ధనుంజయ మాట్లాడుతూ.. ఉత్పత్తిదారుల నుంచి నేరుగా వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించడమే లక్ష్యమన్నారు. మార్కెట్‌లో చీరలు, చేనేత, ఖాదీ, మహిళలు, పురుషులు, చిన్నారుల దుస్తులు, టైలరింగ్, ఫ్యాన్సీ, బంగారు ఆభరణాలు, హస్తకళల దుకా ణాలు ఉన్నాయని తెలిపారు. శ్రీలీల మార్కెట్‌ను సందర్శించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, దుకాణ యజమానులు, వినియోగదారులు, అభిమానులు పాల్గొన్నారు.

## స్కేటింగ్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన




**మల్కాజ్‌గిరి ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీరామ్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక స్కేటింగ్ కార్యక్రమంలో సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కేటర్లు 80 నిమిషాల పాటు నిరంతరా యంగా స్కేటింగ్ చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో రెగ్యులర్ ఇన్‌లైన్, కార్డు, ప్రొఫెషనల్ ఇన్‌లైన్ రోలర్ బ్లేడ్ విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. చిన్నారులు, యువ స్కేటర్ల అద్భుత ప్రదర్శనతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. స్కేటింగ్ క్రీడను మరింత ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఇన్‌స్టిట్యూట్ కోచ్ శ్రీరామ్, కోచ్ కన్నాగౌడ్, కోచ్ మల్లేష్, వైభవ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక, డిజిటల్ ప్రజా పంపిణీ వ్యవస్థ వైపు మరో ముందడుగు

- వెల్లడించిన మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్..



**హైదరాబాద్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ఆహార భద్రతను కల్పించడంతో పాటు, సంక్షేమ ప్రయోజనాలను పారదర్శకంగా, సమర్థవంతంగా, సకాలంలో అందించేందుకు కట్టుబడి ఉందని మైనారిటీస్ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఈరోజు నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడంలో, లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంలో ఒక ముఖ్యమైన ముందడుగు అని అన్నారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులు తమ రేషన్ కార్డు వివరాలను సులభంగా వెంట తీసుకెళ్లి, అవసరమైన సమయంలో వినియోగించుకోవచ్చని తెలిపారు. పాత రేషన్ పుస్తకాలతో ఎదురయ్యే ఇబ్బందులను డిజిటలైజేషన్ ద్వారా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పట్ల దూరదృష్టి, నిబద్ధతతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ప్రయోజనాలు నేరుగా, పారదర్శకంగా, ఎలాంటి అనవసర ఇబ్బందులు లేకుండా చేరాలి," అని మంత్రి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పలు పథకాలు అమలులో ఉండగా, మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, రేషన్ కార్డుల పరిధిని విస్తరించడం, నాణ్యమైన సన్నబియ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్న పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషిని మంత్రి అభినందించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకున్న మంత్రి, గతంలో రేషన్ సరుకులు పొందడంలో, పాత రేషన్ పుస్తకాలను నిర్వహించడంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదు ర్కొనేవారని తెలిపారు. "ఈరోజు సాంకేతికతతో పరిస్థితి మారిం ది. లబ్ధిదారులు జేబులో లేదా పర్సులో సులభంగా పెట్టుకునే స్మార్ట్ కార్డును పొందుతున్నారు. ఈ ప్రక్రియ మరింత సులభం గా, పారదర్శకంగా మారుతోంది," అని మంత్రి అన్నారు. అర్హు లైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. అదేవిధంగా, లబ్ధిదారులకు సాధ్యమైనంత వరకు వారు నివసిస్తున్న ప్రాంతా లకు సమీపంలోనే గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం చర్య లు తీసుకుంటోందని చెప్పారు. గతంలో కొంతమంది లబ్ధిదారు లకు వారి నివాస ప్రాంతాలకు దూరంగా ఇళ్లు కేటాయించడం వల్ల ఉపాధి అవకాశాలు, కుటుంబ సంబంధాలపై ప్రభావం పడేదని మంత్రి పేర్కొన్నారు. "కొత్త విధానంలో అర్హులైన లబ్ధిదారులు నివసించే ప్రాంతాల్లోనే అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి, వారికి స్థానికంగానే గృహాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సర్వేలు కూడా నిర్వహిస్తున్నాము," అని మంత్రి తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బందిని మంత్రి అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. "మన పిల్లల భవిష్యత్తుకు విద్యే అత్యంత ముఖ్యమైన పెట్టుబడి. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చూసుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను," అని మంత్రి అన్నారు. మైనారిటీలు, ఇతర వర్గాలకు సంబంధించిన నిజమైన సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చినప్పుడు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. "ప్రతి అర్హుడైన పౌరుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటమే మా ప్రధాన ప్రాధాన్యత. ప్రజల సమస్యలను వింటూ, వాటిని అర్థం చేసుకుని, పరిష్కారాల కోసం నిరంతరం కృషి చేస్తాము," అని మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు మరియు మీడియా ప్రతినిధులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, ఏ ఐ ఎం ఐ ఎం ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫికార్ అలీ, కౌసర్ మొహియుద్దీన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్యే గణేష్ పాల్గొన్నారు. సీనియర్ అధికారుల్లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ రాజి రెడ్డి, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్, అలాగే ఏసిఎస్ఓ, పౌర సరఫరాల శాఖ అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులపై రేవంత్, ఉత్తమ్‌ల ఫోటోల కోసం రూ. 100 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం..

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం
- మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనా..?
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వడానికి పైసలేవు..
- సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కారు..
- మంత్రి ఫోటో ముద్రించడం పచ్చి రాజ్యాంగ ఉల్లంఘన!



**హైదరాబాద్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలోని నిరుపేదల ఆకలి తీరే రేషన్ కార్డులను తమ సొంత రాజకీయ ప్రచార కరపత్రాలుగామార్చుకొని, పేదలరక్తం పంచుకున్న ప్రజా ధనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బరితెగించి దుర్వినియోగం చేస్తోం దని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆగస్టు 15న సంగారెడ్డితో పాటు 119 నియోజక వర్గాల్లో ప్రారంభించిన 1.05 కోట్ల లామినేటెడ్ రేషన్ కార్డుల పంపిణీ పేరిట జరిగిన భారీ దుబారాపై ఆయన ఘాటుగా స్పంది ంచారు. మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె! రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వ డానికి నిధులు లేవని, ఉద్యోగుల పెన్షన్లు, గ్రాట్యుటీ బకాయిలు చెల్లించలేమని చేతులెత్తేసిన ఈ అసమర్థ ప్రభుత్వం.. ఇప్పటికే ఉన్న ఈ-కార్డులను రద్దు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫోటోలతో కూడిన లామినేటెడ్ కార్డుల కోసం ఏకంగా రూ.100 కోట్ల రూపాయలు తగలేయడం సిగ్గుచేటు అని దాసోజు విమర్శించారు. క్లౌడ్ సర్వర్లు, స్పెషల్ వెబ్ సైట్లు, ప్రింటింగ్, లామినేషన్, 33 జిల్లాల్లో రవాణా పేరిట ఒక్కో కార్డుకు దాదాపు రూ.100 చొప్పున ప్రజల జేబులు కొట్టి సొంత డబ్బా కొట్టుకుంటున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం వద్దకు అధికారులు వెళ్లి భూముల పట్టా పుస్తకాలపై, రేషన్ కార్డులపై తన ఫోటో పెడదామంటే, "ప్రజాధనంతో మన ఫోటోలు వద్దు" అని నిర్ద్వంద్వంగా తిరస్కరించిన సంస్కారం కేసీఆర్‌ది.

**కాంగ్రెస్ పచ్చి ద్వంద్వ నీతి బయటపడింది :** 2021లో కోవిడ్ సర్టిఫికెట్లపై ప్రధాని మోదీ ఫోటో ముద్రిస్తే.. ప్రియాంక గాంధీ మొదలుకొని గల్లీ లీడర్ దాకా "ప్రజల ప్రాణాలు కాపాడే వాక్సిన్లు మోదీ వ్యక్తిగత ప్రచార సాధనాలుగా మారాయి" అని నానా యా గీ చేశారు. వారి ఒత్తిడికి తలొగి, గోవా, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికలసంఘం, మోదీ ఫోటోలను తొలగించాలని ఆదేశించింది. మరినాడు మోదీకి వర్తి ంచిన నియమాలు నేడు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు వర్తించవా అని నిలదీశారు? రేషన్ కార్డు అనేది జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కు. అది రేవంత్, ఉత్తమ్‌లు సొంత జేబులోంచి ఇస్తున్న దానధర్మం కాదు!

**సుప్రీంకోర్టు తీర్పుల ఉల్లంఘన :** 2016 నాటి స్టేట్ ఆఫ్ కర్ణాటక వర్సెస్ కామన్ కాజ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పు ప్రకారం.. ప్రభుత్వ ప్రకటనలపై సిట్టింగ్ సీఎం ఫోటోకు మాత్రమే పరిమిత మినహాయింపు ఉంది. ఏ కేబినెట్ మంత్రి ఫోటో కూడా పెట్టడానికి వీలులేదు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటో ముద్రించడం పచ్చి రాజ్యాంగ విరుద్ధం. రేపు స్థానిక సంస్థలు లేదా జీహెచ్ఎంసీ ఎన్నికల కోడ్ రాగానే ఈ కార్డులన్నీ రద్దవుతాయి లేదా ఫోటోలు తొలగించాల్సి వస్తుంది. మళ్లీ రీ-ప్రింటింగ్ కోసం ఇంకో ?100 కోట్లు బొక్కబెడతారా అని ప్రశ్నించారు?

**బీఆర్ఎస్ ప్రధాన డిమాండ్లు :** రేషన్ కార్డులపైనుంచి వెంటనే ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రుల ఫోటోలను తొల గించి, అధికారిక రాజముద్రతో కూడిన సాధికారిక కార్డులను ప్రజలకు ఇవ్వాలి. ఈ రూ. 100 కోట్ల దుబారాపై తక్షణమే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్ - జూా+) తో సమగ్ర ఆడిట్ జరిపించి, బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలి. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా మంత్రి ఫోటో ముద్రించి నందుకు న్యాయపరమైన, రాజ్యాంగపరమైన చర్యలు చేపట్టాలి. ఎన్నికల కోడ్ వస్తే ఈ 1.05 కోట్ల కార్డుల మాటేమిటో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి. పేద ప్రజల అన్నం కార్డులపై తమ ముఖాలు ముద్రించుకుని ప్రచారం చేసు కోవడం సంక్షేమం కాదు.. అది పేదవాళ్లు పాలకవర్గాల దయా దాక్షిణ్యాలతో కడుపునింపుకుంటున్నారనే సందేశమిస్తూ పేదలను అవమానించడం, పక్కా రాజకీయ దివాళాకోరుతనం! తక్షణమే ఈ ఫోటో కార్డుల డ్రామా ఆపి, ప్రజల సొమ్మును ప్రజా సంక్షేమానికే ఖర్చు చేయాలి..

# జూరాల నీటిని పొదుపుగా వినియోగించాలి

- ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరతకు అవకాశం
- వరికి బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి
- నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.కేశవరావు..



**గద్వాల, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.కేశవరావు సూచించారు. జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గుతున్న పరిస్థితులపై పర్యవేక్షక ఇంజనీర్ డి.కేశవరావు ఆధ్వర్యంలో ఆదివారం నీటిపారుదల శాఖ అధికారులు, కార్యనిర్వాహక ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పంటల అవసరాలు, ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, దీంతో సాగునీటి కొరత తలెత్తే పరిస్థితి ఉందని కేశవరావు తెలిపారు. రైతులు ముందస్తు జాగ్రత్తగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు దూరంగా ఉండాలని కోరారు. జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం మరింత తగ్గినట్లయితే ముందస్తు చర్యల్లో భాగంగా కాలువలను మూసివేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రాజెక్టుకు వచ్చే నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, అందుబాటులో ఉన్న నీటిని క్రమపద్ధతిలో సాగునీటి అవసరాలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని ఆయకట్టు పరిధిలోని గ్రామాలు, మండలాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతులు సాగునీటిని అవసరానికి అనుగుణంగా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో జూరాల ప్రాజెక్టుకు సరిపడా నీటి ప్రవాహం వచ్చినట్లయితే అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి కాలువలకు సాగునీటి విడుదలపై తదుపరి చర్యలు తీసుకుంటామని పర్యవేక్షక ఇంజనీర్ డి.కేశవరావు తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

# స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు

- ఆహ్వాన పత్రం, వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించిన ఆలయ కమిటీ..



**కరీంనగర్ ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్ జిల్లాతిమ్మాపూర్ మండలం, మహాత్మ నగర్ (ఎల్.ఎం.డి. కాలనీ) లో వెలసిన స్వయంభూ శ్రీశ్రీశ్రీ తాపాలలక్ష్మీ నరసింహ స్వామి వారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుండి ప్రారంభమవుతాయని,బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రోజున దేవాలయ కమిటీ అధ్యక్షులుఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పాలకమండలి సభ్యులతో కలిసి దేవాలయ వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఈనెల 22 శనివారం నుండి 28 శుక్రవారం వరకు జరుగుతాయన్నారు. ఈనెల 22 నుండి 23 ఆదివారం వరకు అధ్యయనోత్సవాలు ,24 తేదీ సోమవారం రోజున రక్షాబంధనము, గరుడ పటాధివాసము, యజ్ఞం ప్రారంభం, 25 తేదీ రోజున మంగళవారం రోజున హోమము, 24 గంటల నిరంతర భజన కార్యక్రమం, 26 తేదిన బుధవారం రోజున నిత్యపూర్ణాహుతి అనంతరం మధ్యాహ్నం గం. 12-15 ని॥లకు అభిజిత్ లగ్నంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం సామూహిక అష్టాదశ ఆరాధన కార్యక్రమం, అలాగే సాయంత్రం గం. 6-00 గంటలకు లక్ష్మీపూజ, సామూహిక కుంకుమార్చనలు, హోమధూము, నిత్యపూర్ణాహుతి, 27 తేదీ గురువారం రోజున ఉదయం గం. 9-00 గంటలకు శ్రీ సుదర్శన నారసింహ హోమము , 28 తేదీ శుక్రవారం రోజున ఉదయం గం. 9-00 గంటలకు శేషహోమము, మహాపూర్ణాహుతి, బలిహారణం, చక్రతీర్థం, ఆరగింపు, రాత్రి గం. 7-00 గంటలకు శ్రీ పుష్పయాగం, ధ్వజారోహణము, సప్త వర్ణములు, ఉద్వాసన బలి, గ్రామబలి, ఆరగింపు ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, ఆలయ కమిటి , అర్చకులు కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ బాధ్యులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి, పెండ్యాల కొండల్ రెడ్డి,గూడ కమలాకర్ ,గాదే వెంకటపతి, గొంటుకు కనకయ్య,కేతిరెడ్డి నారాయణ రెడ్డి దొనపాటి రాజిరెడ్డి, ముయిగంటి రాజేందర్ , కొండ్ర రాజు, బొమ్మరవేని బాలకృష్ణ, కన్నం సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో కులగణన చేయడం హర్షణీయం..

- బీసీ సాధికారితకు నాంది చరిత్రాత్మకం..
- టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర..



**హైదరాబాద్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న జనగణనలో కులగణన చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సాధికారితకు తొలి మెట్టన్నారు. ఈ మేరకు ఆయన ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణ గంగపుత్ర సంఘం బీసీ సామాజిక వర్గాలందరి తరుపున కృతజ్ఞతలు తెలుపుతూ కేంద్రంలో బీసీల కొరకు ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్నారు.

# భక్తులతో కిక్కిరిసిన యాదాద్రి..

- కొండపై ఆధ్యాత్మిక కోలాహలం..
- క్యూ లైన్లలో కిక్కిరిసిన భక్తులు, కొనసాగుతున్న స్వామివారి దర్శనాలు



**యాదగిరిగుట్ట, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహస్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామివారిని దర్శించు కోవడానికి భక్తులు బారులు తీరారు. కొండపై ఎక్కడ చూసినా భక్తుల కోలాహలం కనిపించింది. స్వామివారిని దర్శించుకోవడానికి ధర్మదర్శ నానికి మూడు గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి, రెండు గంటల సమయం పట్టిందని ఆలయ అధికారులు తెలిపారు. కొండపైన సరైన పార్కింగ్ స్థలం లేక వాహనాలు నిలుపుకోవడానికి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు కొండపైకి తరలడంతో కొండపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొండ కింద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలిపి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కొండపైకి చేరుకు న్నారు. క్యూ కాంప్లెక్స్‌లలో భక్తులు వేచి ఉండడంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానాల యంలో సువర్ణ పుష్పార్చనలో, కొండకిందగల సత్యనారాయణ స్వామి వ్రతాలలో కూడా పాల్గొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రసాదాల క్యూ లైన్లు ధర్మదర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిట లాడాయి.

**స్వామివారి నిత్య ఆదాయం 64,77,232 :** ఆదివారం స్వామి వారి నిత్య ఆదాయం 64,77,232 రూపాయల సమకూరింది. అత్యధికంగా ప్రసాద విక్రయాల వల్ల 25,71,950 రూపాయలు స్వామి వారి ఖజానాకు చేరింది. అలాగే స్వామివారికి 2840 మంది తలనీలాలు సమర్పించారు.

# గుర్రంగూడలో బోనాల తొట్టెల కార్యక్రమం..



**బడంగ్ పేట్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** బడంగ్ పేట్, సర్కిల్ లోని 57వ డివిజన్ గుర్రంగూడలో ఎరుకల శ్రీనివాస్ గౌడ్ అహువనం బోనాల సందర్భంగా తొట్టెల కార్యక్రమంలో జెల్లా రమేష్ గౌడ్ కాంగ్రెస్ యువజన రాష్ట్ర నాయకులు, లక్ష్మి నారాయణ గౌడ్, శ్రీకాంత్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు స్పందించాలి..

- మానవతా దృక్పథంతో స్వయం ఉపాధిని, కొనసాగించడానికి అనుమతించాలి
- అధికారులను వేడుకుంటున్న ఓ దివ్యాంగుడు



**కోహెడ, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** సిద్దిపేట జిల్లా, కోహెడ మండలం, బస్వాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు తాడెం లింగం, చిన్నతనంలో పోలియో కారణంగా తన రెండు కాళ్లను కోల్పోయి, ప్రస్తుతం పోషణ కోసం తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నాడు. తన జీవితం ఒక భారంగా మారిందని అతను భావిస్తున్న తరుణంలో.., జూలై 7వ తేదీన అధికారులు, దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ ఆటో-రిక్షాను మంజూరు చేసి, అతనికి అందించి ఆశ, విశ్వాసాన్ని కలిగించారు. అయితే, ఈ వాహనాన్ని ఉపయోగించి ఒక చిన్న వ్యాపారాన్ని ప్రారంభించడానికి అతను సిద్ధమవుతున్న సమయంలో.. ఆటో అందుకున్న నెల రోజులకే, ఈ నెల 8వ తేదీన సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం నుండి అతనికి ఒక నోటీసు అందింది. ప్రభుత్వం నుండి రెండు వాహనాలు అందుకున్నారనే ఆరోపణలపై ఆటోను తిరిగి ఇవ్వాలని ఆ నోటీసులో డిమాండ్ చేశారు. ఈ పరిణామంతో అతను ఇప్పుడు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ప్రభుత్వం అందించిన మొబైల్ ఆటో కేవలం ఒక వాహనం మాత్రమే కాదని, తనలాంటి దివ్యాంగుడికి అది స్వయం ఉపాధికి, ఆత్మగౌరవానికి, జీవనోపాధికి ఒక కీలకమైన సాధనమని అతను చెబుతున్నాడు. అధికారులు తన పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిగణించి, మంజూరైన వాహనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోకుండా, దానిని ఉపయోగించి తన స్వయం ఉపాధిని కొనసాగించడానికి అనుమతించాలని అధికారులను వేడుకుంటున్నారు.

## గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి

# జన్మదిన వేడుకలు..



**ఆత్మకూరు (ఎం) ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సునీత మహేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో గొంగిడి సునీత మహేందర్‌రెడ్డిని మరోసారి ఆలేరు ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిగా చూడాలని ఆకాంక్షించారు. ఆమె నాయకత్వంలో ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు యాస ఇంద్రారెడ్డి, భాషబోయిన ఉప్పలయ్య యాదవ్, పార్టీ సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్, సర్పంచ్‌లు బీసు ధనలక్ష్మి చందర్‌గౌడ్, ఎర్ర సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు కోరె బిక్షపతి, గనగాని మల్లేష్‌గౌడ్, గడ్డం దశరథగౌడ్, మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ ఉపేందర్‌రెడ్డి, నాయకులు యాస అంజిరెడ్డి, గట్టు విశాల్, బొక్క వెంకట్‌రెడ్డి, అబ్బసాయిలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ధర్మారం, జాబితాపూర్ యువకులు

### మృతుడి కుటుంబానికి రూ.43 వేల ఆర్థిక సాయం



జగిత్యాల, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

జగిత్యాల రూరల్ మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దీకొండ శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని గుర్తించిన ధర్మారం, జాబితాపూర్ గ్రామాల యువకులు మానవత్వంతో ముందుకొచ్చారు.బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు యువకులు తమవంతుగా విరాళాలు సేకరించి రూ.43 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.సేకరించిన మొత్తాన్ని గ్రామ సర్పంచ్ పరమాల సుమలత మల్లేష్, ఉపసర్పంచ్ దీకొండ ప్రేమ్‌నాథ్, గ్రామ యువకులు కలిసి మృతుడి భార్యకు అందజేశారు.ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన యువకులను పలువురు అభినందించారు. యువతలో సేవాభావం, మానవత్వం వెల్లివిరియడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నక్క సతీష్, గంగాధరి గంగా నరసయ్య, నీలం గంగారం, ధనేశ్వరరావు, నలువాల గంగారాం, ఈదుల లింగయ్య, రామంచల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దయాకర్



శేరిలింగంపల్లి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ పరిధిలోని ఎంఏ నగర్‌లో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం పోతరాజు లాలయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఇటీవల మృతిచెందిన రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మేకల చేరాలుకు ఈ సందర్భంగా నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కమిటీ పునర్వ్యవస్థీకరణపై సుదీర్ఘంగా చర్చించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా వెలమకంటి దయాకర్‌ను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పారంది స్వామిని నియమిస్తూ తీర్మానం చేశారు. ఇప్పటివరకు అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా బాధ్యతలు నిర్వర్తించిన పోతరాజు లాలయ్య, జన్ను నరసయ్యలను సంఘం గౌరవాధ్యక్షులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, ఉపాధ్యక్షురాలు మల్లెల జయశ్రీ, కార్యదర్శి దప్పు నగేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఘనపురం రవీందర్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గొర్రె థామస్, ప్రధాన కార్యదర్శి ఇనంపల్లి రమేష్, ప్రతినిధులు గోదారి భాగ్యలక్ష్మి, ఎన్.వి దీప, సుధారాణి, సౌజన్య, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సుజాత యాదవ్ సేవలు చిరస్మరణీయం



శేరిలింగంపల్లి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు మహిళా సాధికారతకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఐసీసీ సీడబ్ల్యూసీ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కొనియాడారు. సుజాత యాదవ్ మృతి సామాజిక రంగానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివారం నల్లగండ్లలోని మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుజాత యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## కదిరి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై హెచ్ డి ఎస్ సమావేశం పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్




కదిరి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

కదిరి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ (HDS) సమావేశాన్ని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుధ్యం, శానిటేషన్, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు భోజన వసతి కల్పించే అంశంపై కూడా చర్చించారు. ముఖ్యంగా శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానం ద్వారా ఆసుపత్రికి వచ్చే రోగులకు భోజనం అందించే అవకాశంపై సమావేశంలో చర్చించి, దీనిని ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలపై సమాలోచన చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, భోజనం వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.

"ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన సౌకర్యాలు అందించడమే లక్ష్యం."ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిడెంట్ డా హుస్సేన్ , సీనియర్ డా శంకరయ్య , ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటి సభ్యులు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బేస్తవారిపేటలో సుభోజనం కార్యక్రమం ప్రారంభం





మార్కాపురం, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

మార్కాపురం జిల్లాలో వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికి ఆహారాన్ని క్యారేజీ రూపంలో అందించే కార్యక్రమానికి సుభోజనం, మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ సేవా సంస్థలు శ్రీకరం చుట్టాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి, సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ హాజరయ్యారు. బేస్తవారిపేట మండలంలో నా అనేవాళ్ళు ఎవరూ లేక మంచానికే పరిమితమై ఆహారానికి అవస్థలు పడే వృద్ధులను వికలాంగులను గుర్తించి సుభోజనం, మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి స్వచ్ఛంద సేవ సంస్థలు 12 గ్రామాలలో 64 మందికి ఇంటికే ఆహారాన్ని క్యారేజీ రూపంలో రెండు పూటలా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కామూరి రమణారెడ్డి తెలిపారు.

మొదటి విడతగా బేస్తవారిపేట మండలంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని జిల్లాలో మరింత విస్తరిస్తామని సంస్థ సభ్యులు తెలిపారు. ఇప్పటికే గిద్దలూరు, కొమరోలు, మండలాలలో రాజన్న భోజనశాల పేరిట రూ.5 కడుపునిండా భోజనం అందించే కార్యక్రమాన్ని 9 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని కామూరి రమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఇమ్మడి తిరుపతయ్య, అధ్యక్షులు, వెంకటేశ్వర రెడ్డి, సహాయ అధ్యక్షుడు, తులసి ప్రసాద్, దర్దనాల గోపాల్, పరిషత్ పోయిన గోపాల్, నాగేశ్వరరావు, సంస్థ అధ్యక్షులు మేకల రామ్మోహన్రావు, కోశాధికారి వెంకటరాయుడు, కార్యక్రమానికి హాజరైన వారు.. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు స్వరూప రెడ్డి, బాదం గోపాల్, మోహన్ రెడ్డి, ఆర్గనైజర్ సెక్రెటరీ దూదేకులవలి, మెంబర్స్, నాగ సురేష్, ప్రసాద్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పర్యటన...



సింగరేణి, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

వైరా మాజీ శాసనసభ్యులు లావుడ్యా రాములు నాయక్ ఆదివారం సింగరేణి మండలంలో విస్తృతంగా పర్యటించి,పలు విషాద కుటుంబాలను పరామర్శించారు.

ముందుగా వెంకట్యా తండా సందర్శించిన ఆయన,ఇటీవల మృతి చెందిన ఫారెస్ట్ అధికారి బానోత్ నవీన్ కుటుంబాన్ని పరామర్శించారు. నవీన్ తండ్రి, మాజీ ఎంపీపీ బానోత్ దేవుల నాయక్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం నవీన్ సతీమణి, పిల్లలతో మాట్లాడి తమ సానుభూతిని తెలిపారు.

అటు పిమ్మట చిన్న కట్టుగూడెం గ్రామానికి చెందిన మాజీ దిశా కమిటీ సభ్యుడు లకవత్ లక్ష్మణ్, జర్నలిస్ట్ రాము నాయనమ్మ అంజి దశదిన దినకర్మకు హాజరయ్యారు.అక్కడ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి,కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, సర్పంచ్ ధారావత్ మంగీలాల్,ఆడప పుల్లారావు,మాజీ సర్పంచ్ బానోత్ శంకర్, భగవాన్ దాస్, వాంకుడోత్ కృష్ణ, నాయకులు అజ్మీర వీరన్న, డాక్టర్ బాబులాల్, గోపాల్, గూగులోత్ నవీన్, యుగంధర్, రవి, బానోత్ చక్రం, మాజీ ఎంపీటీసీ లాలు, బుచ్చిరాం మ, గ్రామయువ నాయకులు పాల్గొన్నారు.

## మత్స్య భవనం ప్రారంభ మహోత్సవానికి హృదయపూర్వక ఆహ్వానం





సోన్, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

సోన్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఎలేటి మహేశ్వర్ రెడ్డి నూతనంగా నిర్మించిన మహిళా మత్స్యకారుల భవనాన్ని ప్రారంభించారు, మహిళల జీ జీవనోపాది ఆర్థిక సాధికారిక కేంద్రం,జాలరి సోదరుల చిరకాల స్వప్నం

ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,

మత్స్య పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మహిళలకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మత్స్యకారుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ భవన నిర్మాణం ద్వారా మహిళా మత్స్యకారులకు శిక్షణ, సమావేశాలు, మత్స్య ఉత్పత్తుల నిల్వకు అనుకూలంగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, సర్పంచ్ అంపోలి వనజా కృష్ణ ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ,సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మత్స్యకార సంఘం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజల చైతన్యంతో మళ్లీ అధికారం మనదే

### పి రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్ బి అంజా ద్ భాషా



కడప, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపే తం చేసేందుకు కలిసి కట్టుగా పని చేయాలని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్ బి అంజాద్ భాషా లు పిలుపునిచ్చారు ఆదివారం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యా లయంలో జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన యువజన విభాగం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించా రు.ఇం దులో ఎస్.బి. అంజాద్ భాషా మాజీ మేయర్ పాకా సురేష్ మాజీ డిప్యూటీ మేయర్ నిత్యా నంద రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు షఫీ , జిల్లా యువజన విభాగం అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య, నగర యువజన విభాగం అధ్యక్షులు గుంటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

కడప నియోజకవర్గంలో వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీకి బలమైన పునా దులు ఉన్నాయని, పార్టీ శ్రేణుల ఐక్యతతో ఆ పునాదులను మ రింత బలోపేతం చేయాలని అన్నారు.యువతే దేశ భవిష్యత్తు యువత తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. యువతను చైతన్యవంతులను చేసి, వారి సమస్యలపై నిరంతరం పోరా డేందుకు పార్టీ యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయా లని పిలుపునిచ్చా రు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా పూర్తిస్థా యి లో అమలు చేయలేదని నాయ కులు విమర్శించారు.

## దక్షిణ కొరియాలోని సియోల్‌లో మంత్రి లోకేష్‌తో వైవీయూ ప్రొఫె సర్



కడప, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

ఆంధ్రప్రదేశ్‌లో ని అనేక ఉన్నత విద్యాసంస్థ లలో, ముఖ్యంగా గ్రామీణ నేప థ్యాల నుండి వచ్చిన విద్యార్థు లకు సౌకర్యాలు, ఆచరణాత్మక అభ్యాస అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయని, ఇది ఉపాధి మార్కెట్‌లో వారి పోటీ తత్వాన్ని ప్రభావితం చేస్తోందని దక్షిణ కొరియా సియోల్‌లోని కొంకుక్ విశ్వవిద్యాలయంలో ఆహ్వానిత బ్రెయిన్ పూల్ ప్రొఫె సర్‌గా పనిచేస్తున్న కడప యోగి వేమన విశ్వవిద్యాలయం మెటీరియల్స్ సైన్స్ అండ్ నానోటెక్నా లజీ విభాగ ప్రొఫెసర్ ఎం.వి. శంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ హెచ్‌ఆర్డీ శాఖ మంత్రి నారా లోకేష్, అధికారుల బృందం దక్షిణ కొరియాలోని సియోల్

సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, దక్షిణ కొరియా తెలుగు సంఘం (టాస్క్) సంయుక్తంగా సియోల్‌లోని లోట్టే హోటల్‌లో తెలుగు ప్రజల సమావేశాన్ని నిర్వహించాయి. దక్షిణ కొరియాలో నివసిస్తూ, పనిచేస్తున్న పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్ర మానికి హాజరై మంత్రితో ముచ్చటించారు. ఈ సభను ఉద్దేశించి నారా లోకేష్ మాట్లా డుతూ ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగు సమాజానికి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై తమ సూచనలు, అభిప్రాయాలను పంచుకోవాలని వారిని ప్రోత్సహించారు.ఉన్నత విద్యపై జరిగిన చర్చ సందర్భం గా ప్రొఫెసర్ ఎం.వి. శంకర్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య, పరిశోధన, ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడంపై తన అభిప్రాయాలను, సూచనలను పంచుకున్నారు. రాష్ట్రంలో సాంకేతిక, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన క్వాంటం వ్యాలీ వంటి కార్యక్రమాలను, అలాగే ఇతర చర్యలను ప్రొఫెసర్ శంకర్ అభినందించారు. దక్షిణ కొరియాలో ఉన్నత విద్య, పరిశోధన-అభివృద్ధి, పరిశ్ర మలు, ఇతర రంగాలకు తెలుగు సమాజం అందించిన గణనీ యమైన కృషిని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

## నారాయణపూర్ గ్రామం ఉయ్యాలో.. ముంపు గ్రామం కావలి ఉయ్యాలో...

### ఎమ్మెల్యే మనసు మారి ఉయ్యాలో.. ముంపు గ్రామం చేయాలి ఉయ్యాలో...

### బతుకమ్మ పాటలతో నిరసన తెలిపిన ముంపు గ్రామ మహిళలు



గంగాధర, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని పూర్తిగా ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 8 వ రోజుకు చేరుకుంది. గ్రామాన్ని పూర్తిస్థాయిలో ముంపు గ్రామంగా ప్రకటించి, ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ కలిసి రిలే నిరాహారదీక్ష వద్ద "నారాయణపూర్ గ్రామం ఉయ్యాలో.. ముంపు గ్రామం కావాలి ఉయ్యాలో... ఎమ్మెల్యే మనసు మారి ఉయ్యాలో.. ముంపు గ్రామం చేయాలి ఉయ్యాలో..." అంటూ బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

నారాయణపూర్ చెరువును జలాశయంగా అభివృద్ధి చేస్తే కట్ట కింది ప్రాంతం ముంపునకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రభుత్వం కొన్ని ఇళ్లకు మాత్రమే పరిహారం మంజూరు చేసినట్లు ఉందని, అయితే గ్రామం మొత్తాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

"మా నారాయణపూర్‌ను పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించే వరకు మా ఉద్యమం ఆగదు" అని గ్రామస్తులు స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తుల సమస్యను తక్షణమే పరిగణించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## సొంత ఆడబిడ్డకే న్యాయం చేయలేనోడు.. తెలంగాణ ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తాడు : సీఎం రేవంత్‌రెడ్డి

ములుగు, ఆగస్టు 17 (జర్నలిస్ట్ ఫైల్) :

ములుగు పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.మంత్రి సీతక్కను తన సొంత ఆడబిడ్డగా భావిస్తున్నానని, రక్త సంబంధం లేకపోయినా సోదరితో సమానంగా చూసుకుంటున్నానని అన్నారు. ప్రతిపక్ష నాయకులను దృష్టిలో పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తోడబుట్టిన చెల్లెలికి ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో ఇంటి నుంచి బయటకు పంపించిన వ్యక్తి తెలంగాణలోని రెండు కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తాడా అని ప్రశ్నించారు.ఫామ్‌హౌస్‌లలో పడుకుని ఉండేవారు ప్రజల సమస్యలు ఏం పరిష్కరిస్తారని సీఎం ఎద్దేవా చేశారు. కొడుకు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన బాధ్యత తండ్రిపై కూడా ఉంటుందని,సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు పంపిస్తుంటే తండ్రి మౌనంగా ఉన్నాడంటే ఆ తప్పులో ఆయనకూ భాగం ఉన్నట్టేనని వ్యాఖ్యానించారు.ఇలాంటి తండ్రి కొడుకులు తెలంగాణకు దాపురించిన శనైశ్వరుల్లా రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజలకు మంచి జరగకూడదని కోరుకోవడం దుర్మార్గమని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కరువు రావాలని,వర్షాలు కురవకూడదని కోరుతూ క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలపై ఆరోపణలు చేశారు. అయితే ఎన్ని పూజలు చేసినా ప్రజల ఆశీర్వాదం,దేవుడి దీవెనలు తమ ప్రభుత్వానికి ఉన్నాయని అన్నారు.ప్రతికూల శక్తులు ఉన్నప్పటికీ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండిందని సీఎం అన్నారు.

# ప్రతి ఫిర్యాదుకు చట్టబద్ధమైన పరిష్కారం



○ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా చర్యలు: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 143 ఫిర్యాదులను అదనపు ఎస్పీ రమణమూర్తి, ఇతర పోలీసు అధికారులతో కలిసి ఆయన స్వీకరించారు. ప్రతి వినతిని పరిశీలించి, నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

PGRSలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్ విధానంలో సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారునికి సమాచారం అందించి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే పిటిషన్‌ను ముగించాలని స్పష్టం చేశారు. సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో సరిపెట్టకుండా అవి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని వకుల్ జిందాల్ సూచించారు. P-GRS కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో జిల్లా పోలీస్ సిబ్బంది సహకరించారు. ఇదిలా ఉండగా.. గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, వృద్ధులు, నిరుపేదలకు ఈ సేవ ఉపయోగకరంగా ఉంటోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి, ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం, PGRS సీఐ బిలాలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తాడేపల్లిలో కేపీఆర్ ఆర్థోపెడిక్ సెంటర్ ప్రారంభం




**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి మెయిన్ రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేపీఆర్ ఆర్థోపెడిక్ సెంటర్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ వై. రత్నాకర్ రావు (ఎంఎస్ ఆర్థో) హాజరై సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కాట్రగడ్డ పృథ్వీ రాజ్ (ఎంఎస్ ఆర్థో) మాట్లాడుతూ ఎముకలు, కీళ్లతో పాటు నరాల సమస్యలతో బాధపడుతున్న వారికి ఆధునిక వైద్య విధానాలతో ఖచ్చితమైన చికిత్స అందించి, సమస్యలకు పరిష్కారం చూపడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సెంటర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఓపీ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు డాక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతి నెల నాలుగో శనివారం రూ. 2,500 విలువైన ఎముకల పటిష్టత పరీక్ష (బోన్ డెన్సిటీ టెస్ట్)ను ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేపీఆర్ ఆర్థోపెడిక్ సెంటర్‌లో భుజం, వెన్నెముక సమస్యలకు చికిత్సతో పాటు హిప్ రిప్లేస్‌మెంట్, మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు, చెయ్యి-మణికట్టు శస్త్రచికిత్సలు, పాదం-మడమ సమస్యలకు చికిత్స వంటి వివిధ ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ పృథ్వీ రాజ్ తెలిపారు. తాడేపల్లి పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని అసెంబ్లీ సాక్షిగా తిప్పికొట్టామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. సోమవారం వెలగపూడిలో జరుగుతున్న శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ కేవలం ఉద్యోగాల భర్తీ కార్యక్రమం కాదని, రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడి అని పేర్కొన్నారు. పారదర్శకంగా, వేగవంతంగా నియామక ప్రక్రియ చేపట్టడాన్ని తప్పుపడుతూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు.

ఒక ఉపాధ్యాయ నియామకం అంటే కేవలం ఖాళీ పోస్టును భర్తీ చేయడం కాదని, భవిష్యత్ తరాల డాక్టర్లు, ఇంజినీర్లు, అధికారులు, నాయకులను తీర్చిదిద్దే బాధ్యత అని అన్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ కొత్త ఆశలు నింపిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక నియామక సంస్థలు అనుసరిస్తున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానాన్ని అమలు చేశామని, దివ్యాంగ అభ్యర్థుల అర్హతలను వైద్య బోర్డుల ద్వారా, క్రీడాకారుల ధ్రువీకరణను సంబంధిత సంస్థల ద్వారా పరిశీలించామని తెలిపారు. యువగళం పాదయాత్రలో యువత సమస్యలను ప్రత్యక్షంగా చూసిన నారా లోకేష్ ఇచ్చిన హామీకి మెగా డీఎస్సీ నిదర్శనమన్నారు.

విద్యాశాఖలో నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణలు రాష్ట్ర విద్యా వ్యవస్థను కొత్త దిశగా తీసుకెళ్తున్నాయని గళ్ళా మాధవి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామకాల విషయంలో తెలుగుదేశం పార్టీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, గతంలో లక్షలాది మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం విద్య, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

మెగా డీఎస్సీపై వైసీపీ నేతల విమర్శలు యువత, ఉద్యోగులు, న్యాయవ్యవస్థను అవమానించేలా ఉన్నాయని గళ్ళా మాధవి మండిపడ్డారు. న్యాయస్థానాల్లో వచ్చిన తీర్పుల అనంతరం కూడా నిరాధార ఆరోపణలు, నిరసనలు కొనసాగించడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసిన వైసీపీ నేతలు, నిజాయితీగా ఉద్యోగాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై గుంటూరులో పూర్తి స్థాయి నిషేధం

○ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు.. దుకాణాలు సీజ్ చేస్తాం: కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా గుంటూరు నగరంలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై సోమవారం నుంచి పూర్తి స్థాయి నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ తెలిపారు. వాణిజ్య సంస్థలు, దుకాణాలు, వీధి వ్యాపారులు, ప్రజలు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘించే దుకాణదారులకు రెండు విడతల్లో అపరాధ రుసుం విధించినా మార్పు లేకపోతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు వార్డు స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, గోదాముల్లో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ నిల్వలు, విక్రయాలు, వినియోగాన్ని గుర్తించనున్నట్లు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన గుడ్డ, కాగితపు సంచులను వినియోగించాలని కమిషనర్ ప్రజలకు, వ్యాపారులకు సూచించారు. పరిశుభ్రమైన, ప్లాస్టిక్ రహిత గుంటూరు నగర నిర్మాణానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయం ఎక్కడైనా కనిపిస్తే వెంటనే నగరపాలక సంస్థకు సమాచారం అందించాలని సూచించారు.

నగరంలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు లేదా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం కనిపిస్తే కాల్ సెంటర్ 0863-2345103కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరం పరిష్కరించాలి

○ అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యం: డీఆర్ఓ ఖాజావలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీఆర్ఓతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాష, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సత్యనారాయణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. సమస్యల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

**పీజీఆర్ఎస్ నిర్వహణను పరిశీలించిన చిన్నారులు**

ప్రజల సమస్యలను అధికారులు ఎలా స్వీకరిస్తారు, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలుసుకునేందుకు నంబూరులోని వివా పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థులు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజల నుంచి అర్జీల స్వీకరణ, వాటిని సంబంధిత శాఖలకు పంపడం, పరిష్కార ప్రక్రియను పర్యవేక్షించడం తదితర అంశాలను విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. విద్యార్థులకు డీఆర్ఓ ఖాజావలి పీజీఆర్ఎస్ నిర్వహణ విధానం, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారుల బాధ్యతలను వివరించారు. విద్యార్థులు గమనించిన అంశాలు, వారి అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థుల్లో పరిపాలనా వ్యవస్థపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ యంత్రాంగం పనితీరును విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీ ఈశ్వరీమహాదేవి 323వ జయంతి ఉత్సవాలు ప్రారంభం



○ పీఠాధిపతి శ్రీ శివకుమారస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** శక్తి స్వరూపిణి యగు పరమేశ్వరీ శ్రీ-శ్రీశ్రీ ఈశ్వరీమహాదేవి ద్వావింశత్యుత్తర త్రిశతి తమ అనగా 323వ జయంతి మహోత్సవ పూజా కార్యక్రమాలు సోమవారం శ్రీ ఈశ్వరీ దేవి మఠంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతి శ్రీ శివ కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. మఠం ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో పూలతో అలంకరించబడింది. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఈశ్వరీ మాత కరుణ అందరిపై ఉండాలని భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. మహోత్సవాల్లో భాగంగా వేదపండితులచే మంత్రపఠనం, భజనలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలు పలు రోజుల పాటు కొనసాగనున్నాయి.

# పురందరిశ్వరికి అభినందనలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ నూతనంగా ప్రకటించిన కమిటీలలో ఆంధ్ర ప్రదేశ్ కు సమూచిత స్థానం కల్పించడం పట్ల గుంటూరు జిల్లా కు చెందిన బీజేపీ మైనారిటీ సీనియర్ నాయకులు డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీలో జాతీయ ఉపాధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందరిశ్వరి ని ఎంపిక చేయడం అభినందనీయం అని తెలిపారు. సీనియర్ మహిళా నాయకురాలైన పురందేశ్వరి కి సమూచిత స్థానం కల్పించారాని తెలిపారు. అదే విధంగా రాం మాధవ్ కి కూడా పార్టీ ఉపాధ్యక్ష బాధ్యతలు అందించ్చారని తెలిపారు. పార్టీ జాయింట్ కొ ఆర్డినేటర్ గా విష్ణు వర్ధన్ రెడ్డి కి సమూచిత స్థానం కల్పించారాని తెలిపారు. బీజేపీ బలోపేతానికి ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా పురందేశ్వరి నాయకత్వం దేశ స్థాయిలో గర్వించదగ్గ విధంగా ఉంటుందన్నారు. అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషిచేస్తున్నారని తెలిపారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నూతన మైనారిటీ మోర్చా అధ్యక్షులు గా ఎన్నికైన కె బాశిత్ అలీ కు కూడా ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు.

# శ్రీ ఈశ్వరీ దేవి భక్తులకు అన్నదానం



○ బలిజ అన్నదాన సత్రం అధ్యక్షులు శ్రీనివాసులు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి అమ్మవారి 323 జయంతి సందర్భంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార్ స్వాముల వారి ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవలకు వచ్చిన భక్తులకు బలిజ అన్నదాన సత్రం అధ్యక్షులు దరిమిశెట్టి శ్రీనివాసులు రాయల్ అన్నదానం చేశారు.

బద్వేల్ వాస్తవ్యులు కీ. శే. ధరిమిశెట్టి కూరగాయల వెంకటయ్య-ఆదిలక్ష్మమ్మ దంపతుల కుమారులు ధరిమిశెట్టి వెంకటసుబ్బయ్య-లక్ష్మి దంపతులు, వారి కుమారుడు స్థానిక బలిజ అన్నదాన సత్రం అధ్యక్షులు ధరిమిశెట్టి శ్రీనివాసులు రాయల్ -శ్రీదేవి దంపతులు, వారి కుమారులు వరుణ్‌కుమార్, వీరేన్‌కుమార్, రిత్విక్ రాయల్, కుమార్తె తేజస్విని ఆధ్వర్యంలో ఈ అన్నప్రసాద వితరణ చేపట్టారు.

జయంతి మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు మధ్యాహ్న భోజనాన్ని 500 మందికి పైగా ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి దాతల సేవాభావాన్ని అభినందించారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ తెలగ కాపు నిత్య అన్నదాన సంఘం కమిటీ సభ్యులు మరియు మేనేజర్ కొక్కు రవి రాయల్ అంబిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్ అలాగే కోనేటి వెంకటసుబ్బయ్య, ఆకుల వీరయ్య, ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, ఆకుల శివ, ఆకుల కొండయ్య శాసనాలు శివరామకృష్ణ వినుకొండ వెంకటనారాయణ ,దస్తగిరి మరియు బంధుమిత్రుమిత్రాలు పాల్గొనడం జరిగింది.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో రైతులకు భరోసా

○ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

○ పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు - కృష్ణా జలాలను రాయలసీమకు వినియోగించే దూరదృష్టి చంద్రబాబుదే

○ వైసీపీ పాలనలో రైతులకు కరువు, బకాయిలు - కూటమి పాలనలో సాగునీరు, విద్యుత్, పంటల బీమాతో భరోసా

○ పోలవరం సహా కీలక సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్‌నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సమగ్ర చర్యలు చేపట్టిందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు శ్రీ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు, రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

వర్షపాతం లోటు ప్రభావం రైతులపై పడకుండా సాగునీరు, విద్యుత్, విత్తనాలు, పంటల బీమా, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం వంటి అంశాల్లో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. "కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే పరిస్థితిని అంచనా వేసి రైతులను రక్షించడమే చంద్రబాబు ప్రభుత్వ విధానం" అని స్పష్టం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడం వల్ల కృష్ణా జలాలను రాయలసీమ అవసరాలకు వినియోగించే అవకాశం ఏర్పడిందని జీవీ ఆంజనేయులు తెలిపారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలన్న దూరదృష్టితోనే చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమను అమలు చేసిందని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టిసీమ పథకాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ వర్షాభావ పరిస్థితుల్లోనూ రైతులకు సాగునీటి భరోసా కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని జీవీ ఆంజనేయులు తెలిపారు. పోలవరంతో పాటు రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులను నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ, సాగునీటి లభ్యత పెంపు కోసం విస్తృత స్థాయిలో జల సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

విద్యుత్ డిమాండ్‌లో సవాళ్లు ఉన్నప్పటికీ వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా కొనసాగిస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని జీవీ ఆంజనేయులు తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు నష్టపోకుండా వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సకాలంలో నాణ్యమైన విత్తనాల సరఫరా, పంటల ఎంపికపై అవగాహన కల్పన వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**పంటల బీమా వ్యవస్థ పునరుద్ధరణ - రైతులకు తిరిగి భరోసా**

గత వైసీపీ పాలనలో పంటల బీమా వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని జీవీ ఆంజనేయులు విమర్శించారు. బీమా బకాయిలు, నిర్వహణ లోపాల కారణంగా రైతులకు అందాల్సిన రక్షణ దెబ్బతిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలను పరిష్కరించి రైతులను తిరిగి పంటల బీమా పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

రైతులు పంటల బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా కీలక పాత్ర పోషిస్తుందని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సహకారం అందుతుందని తెలిపారు.

**రైతు సంక్షేమంపై కూటమి ప్రభుత్వ దృష్టి**

గత వైసీపీ పాలనలో కరువు పరిస్థితుల సమయంలో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జీవీ ఆంజనేయులు విమర్శించారు. పంట నష్టాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు సకాలంలో సహాయం అందలేదని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం విత్తనం నుంచి పంట విక్రయం వరకు, సాగునీటి నుంచి విద్యుత్ వరకు, పంటల బీమా నుంచి గిట్టుబాటు ధర వరకు ప్రతి దశలో రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. "వైసీపీ పాలనలో రైతులకు కరువు, బకాయిలు, నిరాశ మిగిలితే, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నీరు, విద్యుత్, బీమా, భరోసా అందిస్తోంది. రైతు సమస్యలపై రాజకీయాలు చేయడం కాకుండా పరిష్కారాలు అందించడమే మా ప్రభుత్వ విధానం" అని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు.

"ప్రతి ఎకరాకు నీరు - ప్రతి రైతుకు భరోసా" అనే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, జలవనరుల సమర్థ వినియోగం, వ్యవసాయ రంగానికి నిరంతర మద్దతు ద్వారా రాష్ట్ర రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## చావలి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండ



- రూ.18.34 కోట్ల సంక్షేమ లబ్ధి.. రూ.1.42 కోట్ల అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

**వేమూరు:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న '2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా వేమూరు మండలం చావలి గ్రామంలో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్‌టీఆర్ భరోసా తదితర సంక్షేమ పథకాల వివరాలను వివరించారు. ప్రజల సమస్యలు, సూచనలను పీఎంఆ రాజూజూలో నమోదు చేశారు.

చావలి గ్రామంలో 6,098 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మొత్తం రూ. 18.34 కోట్ల విలువైన ప్రయోజనాలు అందుతున్నాయని ఆనంద్‌బాబు తెలిపారు. ఎన్‌టీఆర్ భరోసా ద్వారా 1,088 మంది, డ్వాక్రా తోడు ద్వారా 1,520 మంది, దీపం--2 కింద 1,600 మంది, తల్లికి వందనం ద్వారా 617 మంది, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద 516 మంది చొప్పున లబ్ధి పొందుతున్నారని వివరించారు. స్కాలర్‌షిప్‌లు, హౌసింగ్, ఆటో డ్రైవర్ల సేవా పథకం, సీఎంఆర్ఎఫ్, ఎన్‌టీఆర్ వైద్య సేవలతో పాటు 3,231 మంది మహిళలకు మహిళా శక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుతోందన్నారు.

చావలి గ్రామంలో రూ. 1.42 కోట్ల విలువైన 21 అభివృద్ధి పనులు పూర్తికాగా, మరో పని పురోగతిలో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. వేమూరు--చావలి తారు రహదారికి రూ. 30 లక్షలు, ఉపాధి హామీ పథకం కింద డొంక రోడ్లకు రూ. 1.10 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 25 లక్షలు, 10 చేతిపంపుల ఏర్పాటుకు రూ. 1.50 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. గ్రామంలో 21 కి.మీ. సీసీ రోడ్లు, 5 కి.మీ. బీటీ రోడ్లు, 52 కి.మీ. సీసీ డ్రైనేజీ, 690 వీధి దీపాలు, 5 పాఠశాలలు, 8 అంగన్‌వాడీ కేంద్రాలు, 3 కమ్యూనిటీ హాళ్లు, 3 బస్‌షెల్టర్లు, రైతు సేవా కేంద్రం వంటి మౌలిక వసతులు ఉన్నాయని వివరించారు. టీడీపీ--జనసేన నాయకులు సమన్వయంతో పనిచేయడం వల్ల చావలి అభివృద్ధి మరింత వేగంగా జరుగుతోందని ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు చేయూత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విశ్రాంత సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, జీఎస్టి అసిస్టెంట్ కమిషనర్ మేడిద నాగరాజు, తన ఉన్నతికి సోపానంగా నిలిచిన పాఠశాల అభివృద్ధికి అండగా నిలిచారు. సోమవారం విజయవాడ భవానిపురం లోని సీ.ఎస్.ఐ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా టెలివిజన్ ను నాగరాజు బహుమతిగా అందచేసారు. ఇదే పాఠశాల ఆవరణలో నాగరాజు నిర్మిస్తున్న ఒక షెడ్డు నిర్మాణానికి ఆయన ప్రారంభోత్సవం చేసారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, నిఘంటువులను బహుకరించారు. తదంతరం విద్యార్థులకు అన్నదానం చేసారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. సమాజంలో తనకు ఒక మంచి స్థానాన్ని కల్పించిన ఈ పాఠశాల అభివృద్ధికి జీవితాంతం చేయూతనిస్తానన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకోవడం సామాజిక బాధ్యత గా భావించి, విశ్రాంత ఉద్యోగులు తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీనా కుమారి మాట్లాడుతూ.. పాఠశాలకు సంబంధించిన ప్రతి అవసరాన్ని దశల వారీగా నాగరాజు సహాయ సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. పూర్వ విద్యార్థి నాగరాజు చేస్తున్న కృషిని, పూర్వ విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సెంట్రల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ బి. రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ డ్రాఫ్ట్ నిబంధనలపై ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ ప్రైవేట్ వైద్య సేవల క్రమబద్ధీకరణలో భాగంగా రూపొందించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ డ్రాఫ్ట్ రూల్స్, వ్యవస్థల వారీగా రూపొందించిన అపెండిక్స్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ ముగిసింది.

ఆయుర్వేద, హోమియోపతి, యునాని, యోగా, ప్రకృతి వైద్య విభాగాలకు సంబంధించిన నిబంధనలపై ప్రజలు, వైద్య నిపుణుల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు ప్రభుత్వం రెండు వారాల గడువు ఇచ్చింది. ఆగస్టు 3న ఆయుష్ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కామన్ డ్రాఫ్ట్ రూల్స్‌తో పాటు ఆయా వైద్య విధానాలకు సంబంధించిన అపెండిక్స్‌లను ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచారు. ప్రైవేట్ ఆయుష్ వైద్య సేవలను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో రూపొందించిన నిబంధనలపై వివిధ వర్గాలు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు అవకాశం కల్పించారు.

గడువు ముగిసే నాటికి వివిధ వర్గాల నుంచి మొత్తం 18 స్పందనలు అందినట్లు ఆయుష్ శాఖ అధికారులు వెల్లడించారు. అందిన సూచనలు, సలహాలు, అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన అంశాలను క్రోడీకరించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అందిన అభిప్రాయాలను తదుపరి చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఆయుష్ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజాభిప్రాయాల పరిశీలన అనంతరం డ్రాఫ్ట్ నిబంధనలపై ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత!

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్నంలోని సుల్తానాబాద్, ఆలపాటి నగర్, సుగాలి కాలనీ, సరళ నగర్, జేఎంజే కాలేజ్, రోడ్స్, డాక్టర్స్ కాలనీ, ఈటి కాలనీ, ఎరుకల కాలనీ, భాస్కర్ రావు దెబ్బ, ఏకలవ్య వీధి, పాలాద్రి కాలవ రోడ్డు, జెండా చెట్టుబజార్ లలో విద్యుత్ లైన్ లకు మరమ్మతుల క్రమంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలియజేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు

- శ్రీశైలానికి రావాల్సిన 753 టీఎంసీలకు 214 టీఎంసీలే వచ్చాయి : సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోమవారం శాసనసభలో ఎల్ నినోపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఈ ఏడాది తీవ్రమైన లోటు కనిపిస్తోందన్నారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

2026 జూన్ నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో 867 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 557 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని సీఎం తెలిపారు. అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితి ఉందన్నారు. జూలైలో కొన్ని జిల్లాల్లో 68 శాతం వరకు వర్షపాతం లోటు నమోదైందని, ఆగస్టు, సెప్టెంబర్‌లో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం లోటు ఉండే అవకాశం ఉందన్నారు. డిసెంబర్‌లో మాత్రం సాధారణం కంటే ఒక శాతం అధిక వం-షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

వివిధ నదీ బేసిన్లలో జలాల లభ్యత తగ్గిపోతోందని, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిమట్టాలు అడుగంటుతున్నాయని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టుకు సాధారణంగా 753 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 214 టీఎంసీలు మాత్రమే వచ్చాయని చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే నీటిపై రాష్ట్రం ఆధారపడాల్సి ఉందని, ఆయా రాష్ట్రాల్లోని రిజర్వాయర్లు నిండిన తర్వాతే దిగువకు నీరు వస్తుందని వివరించారు. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గుతోందన్నారు.

నీటి సమస్యలు గ్రామాల మధ్యే కాకుండా రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య కూడా తలెత్తుతున్నాయని సీఎం పేర్కొన్నారు. కావేరీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటక మధ్య కొనసాగుతున్న వివాదంలో సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. గోదావరి బేసిన్లోనూ జలాల లభ్యత తగ్గిందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల సమర్థ వినియోగం, భవిష్యత్ అవసరాలపై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చంద్రబాబు సూచించారు.

# హజ్ -2027కు విమాన రాకపోకల తేదీలు ఖరారు

- ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల



మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్ర హజ్ యాత్ర -2027 కోసం సౌదీ అరేబియాకు విమానాల రాకపోకల తేదీలు ఖరారు అయినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 8వ తేదీ నుండి ప్రారంభమై , మే 9వ తేదీవరకు ఇండియా నుండి సౌదీకి విమానాలు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. సౌదీ నుండి ఇండియా కు మే 21వ తేదీ నుండి జూన్ 20 వ తేదీవరకు తిరుగు ప్రయాణపు విమానాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతానికి విమాన రాకపోకల తేదీలు ఖరారు అయ్యాయని, ఏ ఏ ఏంబార్కేషన్ కేంద్రాల నుండి ఏ ఏ తేదీన విమానాలు వెళతాయి అన్న వివరాల నిర్ధారణ ఇంకా ఖరారు కాలేదన్నారు. ఖరారు అయిన వెంటనే బహిరంగ ప్రకటన ద్వారా హాజీలకు ఈ సమాచారాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ ద్వారా చేరవేయడం జరుగుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా,2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్ల ను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

**ఇమాములు,మౌజన్ల గౌరవ వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల :** రాష్ట్రంలోని 10000 మంది ఇమాములు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపు కోసం కూటమి ప్రభుత్వం రూ. 22.50 కోట్లు విడుదల చేసిందని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ప్రస్తుత ఏడాది ఏప్రిల్,మే,జూన్ లకు సంబంధించి మూడు నెలలకు గాను గౌరవ వేతనాల చెల్లింపు కోసం నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇమాములకు రూ. 10,000, మౌజన్ల కు రూ. 5,000 ప్రకారం మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని సంబంధిత మసీదు కమిటీల బ్యాంక్ అకౌంట్లకు నేరుగా జమ చేసే ప్రక్రియ త్వరలో పూర్తి అవుతుందని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తూనే, వారికి ఇచ్చిన హామీలన్నింటిని కార్యాచరణ బద్ధంగా నెరవేర్చడం కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

# క్రోచెట్ లేస్ కళకు కొత్త వెలుగు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో మరో 552 మంది కళాకారులకు ఉచిత కళ్లద్దాలు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చొరవతో హస్తకళాకారుల జీవితాల్లో ఆరోగ్య వెలుగులు నింపే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పది రోజుల క్రితం నరసాపురం ఇంటర్నేషనల్ లేస్ సెంటర్‌లో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో దృష్టి లోపాలు గుర్తించిన 552 మంది క్రోచెట్ లేస్ కళాకారులకు సోమవారం ఉచిత కళ్లద్దాలు అందజేశారు. ఈ నెల 9వ తేదీన నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 700 మంది కళాకారులకు కంప్యూటరైజ్డ్ పవర్ టెస్టులు, కంటి ఒత్తిడి పరీక్షలు, రెటీనా స్కానింగ్, స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహించి కంటి ఆరోగ్యాన్ని అంచనా వేశారు. నాటి పరీక్షల్లో 552 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారణ కావడంతో, అక్కడే ఫ్రేములు తయారు చేసి ఉచితంగా అందించే ఏర్పాటును ఉప ముఖ్యమంత్రివర్యులు చేశారు. శిబిరంలోనే కళాకారులు తమకు నచ్చిన ఫ్రేమ్‌లను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. పది రోజుల్లో అవసరం ఉన్న ప్రతి కళాకారుడికీ ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఇదే శిబిరంలో 45 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని వైద్యులు సూచించగా, మరుసటి రోజే 12 మందికి కాకినాడ శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు పూర్తి చేయించిన విషయం విదితమే. తదుపరి ఆచంట, అత్తిలి తదితర గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు పూర్తవగా, ఉప ముఖ్యమంత్రివర్యుల వారి కార్యాలయం నుంచి వారికి తదుపరి చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బీజేపీ జాతీయ కార్యవర్గంలో ఏపీ నేతలకు కీలక బాధ్యతలు



- రామమాధవ్, పురంధేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డికి పీవీయన్ మాధవ్ అభినందనలు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులకు కీలక బాధ్యతలు దక్కడం పట్ల ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా నియమితులైన రామమాధవ్, దగ్గుబాటి పురంధేశ్వరి, సెల్స్ ఇన్‌చార్జిగా నియమితులైన విష్ణువర్ధన్ రెడ్డికి ఆయన అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జాతీయ నాయకత్వం ఏపీకి చెందిన నేతలకు ప్రాధాన్యం కల్పించడం రాష్ట్ర బీజేపీకి గౌరవకరమన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయడంలో నూతన బాధ్యతలు పొందిన నేతల అనుభవం, నాయకత్వ సామర్థ్యం ఎంతగానో ఉపయోగపడుతుందని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. వారి నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత అభివృద్ధి సాధించి, ప్రజల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని పీవీయన్ మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో లభించిన కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాలని ఆయన కోరారు. కాగా, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్ వేరొక ప్రకటనలో జాతీయ కార్యవర్గంలో నియమితులైన నాయకులకు అభినందనలు తెలిపారు. వారి భవిష్యత్ రాజకీయ ప్రస్థానం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన జీఎంఆర్ ప్రతినిధి



- భోగాపురం విమానాశ్రయం విజయవంతమైన ప్రారంభంపై అభినందనలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం, వాణిజ్య కార్యకలాపాలు విజయవంతంగా ప్రారంభమైన సందర్భంగా జీఎంఆర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. ప్రసన్న రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలోని ఆర్అండ్‌బీ, ఐఅండ్ఐ శాఖ కార్యాలయంలో జరిగిన భేటీలో మంత్రికి మెమెంటో అందజేశారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం, కమర్షియల్ ఆపరేషన్స్ విజయవంతంగా ప్రారంభం కావడంపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధి అభినందనలు తెలిపారు. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వం అందించిన సహకారానికి, అన్ని విధాలుగా అండగా నిలిచిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అందరూ సమన్వయంతో కలిసి పనిచేయడం వల్ల భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో కమర్షియల్ ఆపరేషన్స్ విజయవంతంగా ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం విమానాశ్రయం ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని, ఈ ప్రాంత రూపురేఖలను మార్చే స్థాయిలో అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రజలకు ప్రపంచస్థాయి ప్రయాణ సౌకర్యాలను అందించడంతో పాటు సరికొత్త ప్రయాణ అనుభూతిని కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు. ఉత్తరాంధ్రలో ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి విమానాశ్రయం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరం పరిష్కరించాలి
- కార్డులు లేని యానాదులకు ఆధార్ కార్డులు అందజేయాలి
- అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ సమీక్ష



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నందున, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ ఆదేశించారు.

సోమవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రెవెన్యూ అంశాలు, ఆధార్ కార్డులు లేని యానాది కుటుంబాల గుర్తింపు, గ్రీన్ గుంటూరు, క్రాప్ ఇన్సూరెన్స్, వి.బి.జి. రామ్‌జీ తదితర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం, ఎన్నికల సంఘం నుంచి అందే మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పోలింగ్ కేంద్రాల పరిస్థితి, సిబ్బంది సమన్వయం తదితర అంశాలపై ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రత్యేకంగా సమీక్షించి త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

**రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను కూడా ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. భూ సంబంధిత సమస్యలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర రెవెన్యూ సేవలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని తెలిపారు.

**కార్డులు లేని యానాదుల గుర్తింపు**

జిల్లాలో ఆధార్ కార్డులు లేని యానాది కుటుంబాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వారికి ఆధార్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత గ్రామాలు, నివాస ప్రాంతాలను అధికారులు సందర్శించి అర్హులైన వారిని గుర్తించాలని, అవసరమైన పత్రాలు, వివరాలను సేకరించి ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**గ్రీన్ గుంటూరు కార్యక్రమంపై సమీక్ష**

గ్రీన్ గుంటూరు కార్యక్రమం కింద చేపడుతున్న పచ్చదనం, మొక్కల పెంపకం, వాటి సంరక్షణ కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా బాధ్యతలు కేటాయించాలని, మొక్కల జీవన శాతం పెంచేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు.

**క్రాప్ ఇన్సూరెన్స్‌పై రైతులకు అవగాహన**

పంటల బీమా పథకం అమలుపై కూడా కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన రైతులందరూ పంటల బీమా ప్రయోజనం పొందేలా వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. పంటల బీమా ప్రాముఖ్యతను రైతులకు వివరించి, అర్హత కలిగిన రైతులు తప్పనిసరిగా బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే జిల్లాలో అమలవుతున్న వి.బి.జి. రామ్‌జీ కింద చేపడుతున్న పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని తెలిపారు. ప్రతి అంశంలో పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డిఆర్ఓ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467